నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 22-2-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:161 పేజీలు:6 వెల: రూ.1/-

నేటి కందం- నేటికి అందం

నిలుపగ పరిపంథి తతుల
కలిగింపగ లాభములను కర్మణ్యులకున్
వెలయింప బూనె మోడీ
సిలిగురి భూగర్భ రైలు శ్రేష్ఠ పథమునన్ !!

(శత్రువులను నిరోధించడానికి, సైనికులకు,వాణిజ్యానికి, రవాణాకు లాభం కలిగించడానికి వీలుగా మోడీ ప్రభుత్వం సిలిగురి భూగర్భ రైలు మార్గాన్ని పక్కాగా నిర్మించడానికి నిర్ణయించింది.)

-రాధశ్రీ
సెల్:9494481210

మంచి మాట

కృత్రిమ మేధాతోని
కొలువులన్నీ ప్రమాదం
ప్రపంచంలో ప్రబలిపోతూ
పొందుతుంటే ఆమోదం.

మనిషి సృష్టి దేనికైనా
మంచి చెడు స్పర్శుండదు
వివేకంతో వాడితేనే
వినాశన తావుండదు

-వేల్పుల నారాయణ
9440433475

సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టేందుకు హైదరాబాద్ సిటీ పోలీసులు సరికొత్త వ్యూహం

– క్రియేటర్లు సామాజిక బాధ్యతగా ముందుకు రావాలి

–జాగృత్ హైదరాబాద్ – సురక్షిత్ హైదరాబాద్' క్యాంపెయిన్‌లో నగర సిపి సజ్జనార్ పిలుపు

హైదరాబాద్ ఫిబ్రవరి 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టేందుకు హైదరాబాద్ సిటీ పోలీసులు సరికొత్త వ్యూహంతో ముందుకు వెళ్తున్నారు. కేవలం అధికారిక హెచ్చరికలకే పరిమితం కాకుండా, సామాన్యులకు సైతం సులువుగా అర్థమయ్యే రీతిలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల ద్వారా విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్, ఐపిఎస్ ఆధ్వర్యంలో విజయవంతంగా కొనసాగుతున్న 'జాగృత్ హైదరాబాద్ – సురక్షిత్ హైదరాబాద్' కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ నూతన విధానానికి విశేష స్పందన లభిస్తోంది. పోలీసుల పిలుపు మేరకు పలువురు ప్రముఖ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, సైబర్ నేరాల తీరుతెన్నులను వివరిస్తూ తమదైన శైలిలో వీడియోలు రూపొందిస్తున్నారు. వీటిని హైదరాబాద్ సిటీ పోలీస్, సిపి విసి సజ్జనార్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలతో 'కొలాబరేట్' చేయడం ద్వారా లక్షలాది మందికి చేరువ చేస్తున్నారు. వినోదాత్మకంగా ఉంటూనే, అత్యంత కీలకమైన సైబర్ భద్రతా సూచనలను ఈ వీడియోలు ప్రజలకు అందిస్తున్నాయి.

మార్చి 31లోగా దేశంలో నక్సలిజం అంతం: మంత్రి అమిత్ షా

గౌహతి ఫిబ్రవరి 21 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: మార్చి 31 లోగా దేశం నుంచి నక్సలిజాన్ని నిర్మూలించనున్నట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. 87వ సీఆర్పీఎఫ్ డే పరేడ్‌లో ఆయన పాల్గొన్నారు. జమ్మూకశ్మీర్‌లో సీఆర్పీఎఫ్ దళాలు కీలక పాత్ర పోషించినట్లు ఆయన చెప్పారు. అక్కడ రాళ్లు రువ్వే ఘటనలు సున్నాకు పడిపోయినట్లు వెల్లడించారు. మణిపూర్‌లోనూ వర్గ హింసను ఆ దళాలు కట్టడి చేసినట్లు చెప్పారు. కేవలం మూడేళ్లలో మావోయిస్టుల వెన్ను విరిచినట్లు సీఆర్పీఎఫ్‌ను మంత్రి షా కీర్తించారు. సీఆర్పీఎఫ్‌పై నమ్మకంతో కాన్ఫిడెంట్‌గా చెబుతున్నానని, దేశంలో 2026 మార్చి 31వ తేదీ వరకు నక్సల్ సమస్యను నిర్మూలించనున్నట్లు షా తెలిపారు. చత్తీస్‌ఘడ్–తెలంగాణ బోర్డర్‌లో ఉన్న కర్రెగుట్టలో ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్‌ను చేపట్టిన దళాలపై మంత్రి షా ప్రశంసలు కురిపించారు. ఆ ఆపరేషన్‌లో గత ఏడాది ఏప్రిల్, మే మధ్య కాలంలో 31 మంది నక్సల్స్ మరణించారు. సుమారు 46 డిగ్రీల ఎండలో ఆ ఆపరేషన్ చేపట్టినట్లు చెప్పారు. నక్సల్స్ ఆధీనంలో ఉన్న ఆ కొండల్ని విముక్తి చేసేందుకు కేంద్ర రిజర్వ్ పోలీసులు దళాలు అత్యంత ధైర్యాన్ని ప్రదర్శించినట్లు తెలిపారు. పదేళ్ల క్రితం దేశంలో మూడు అతిపెద్ద హాట్‌స్పాట్ కేంద్రాలు ఉండేవని, జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదం, ఈశాన్యంలో చొరబాటులు, చత్తీస్‌ఘడ్ అడవుల్లో నక్సలిజం పెద్ద సమస్యగా ఉండేవని, కానీ ఇప్పుడు ఆ ప్రాంతాలు ప్రగతి, శాంతికి సంకేతంగా మారాయన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో 700 మంది సీఆర్పీఎఫ్, నక్సల్ ప్రాంతాల్లో 780 మంది, జమ్మూకశ్మీర్‌లో 540 మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది ప్రాణాలు కోల్పోయినట్లు మంత్రి వెల్లడించారు. వీరి త్యాగాల వల్ల ఒకప్పుడు హింసకు కేంద్ర బిందువులైన ఆ ప్రాంతాలు ఇప్పుడు శాంతియుతంగా మారాయన్నారు.

నాగర్‌కర్నూల్ జిల్లా మల్లన్న జాతరలో తీవ్ర విషాదం..

నల్గొండ, ఫిబ్రవరి 21: నాగర్ కర్నూల్ జిల్లాలోని కుమ్మెర గ్రామంలో ఇవాళ(శనివారం) జరిగిన మల్లన్న జాతరలో (ఔజీణజీతీఎబీతీనినీనీశ్రీ ఓజీశ్రీశ్రీజీనినిజీ ఏజీబిష్ఠజీతీజీ) తీవ్ర విషాదకర ఘటన జరిగింది. జాతర సందర్భంగా దర్శనానికి వచ్చిన భక్తుల నుంచి నిర్వాహకులు డబ్బులు వసూలు చేయడానికి ప్రయత్నించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ డబ్బుల విషయంపై తలెత్తిన వివాదం చివరకు హింసకు దారి తీసింది. ఈ క్రమంలో మూడు నెలల పసిపాప ప్రాణాలు కోల్పోయింది.

భక్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రతి ఏడాదీ జరిగే మల్లన్న జాతరకు సమీప ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతుంటారు. ఈసారి కూడా భారీగా భక్తులు తరలివచ్చారు. అయితే దర్శనం కోసం క్యూలో నిల్చున్న భక్తుల వద్ద.. నిర్వాహకులు దర్శనం పేరుతో డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది భక్తులు ఇది సంప్రదాయంలో లేదని, అదనంగా ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించడంతో వాగ్వాదం ప్రారంభమైంది. మాటామాటా పెరిగి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

భక్తులపై దాడి..

ఆలయ నిర్వాహకులు కొంతమంది భక్తులపై దాడికి దిగినట్లు తెలుస్తోంది. ఈ సమయంలో తల్లిదండ్రుల ఒడిలో ఉన్న మూడు నెలల పాపకు తీవ్ర గాయాలయ్యాయి. తోపులాటలో చిన్నారి నేలపై పడిపోయిందా, లేక నిర్వాహకులు తోసివేయడంతో ప్రమాదం జరిగిందా అనే విషయంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. అయితే తల్లిదండ్రులు మాత్రం నిర్వాహకుల దాడి కారణంగానే తమ బిడ్డకు గాయాలయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాపను వెంటనే సమీప ఆస్పత్రికి తరలించారు. చిన్నారి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పాప మృతి వార్త గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. జాతర నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

పోలీసుల దర్యాప్తు..

పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ సంఘటన జరిగిన సమయంలో అక్కడ ఉన్న సాక్షుల వాంగ్మూలాలు సేకరిస్తున్నారు. అలాగే జాతర ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. పోలీసుల దర్యాప్తు పూర్తయిన తర్వాత అసలు కారణాలు వెలుగులోకి రానున్నాయి. చిన్నారి మృతితో కుమ్మెర గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

బాధిత కుటుంబానికి పరామర్శ..

గ్రామ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు.. ఆస్పత్రికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. చిన్నారి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ, న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

దాడులకు లష్కరే తొయిబా ప్లానింగ్.. ఢిల్లీలో హై అలర్ట్.. భద్రత కట్టుదిట్టం

న్యూ డిల్లీ ఫిబ్రవరి 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్);దేశ రాజధాని ఢిల్లీలో అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. అలాగే ప్రధాన దేవాలయాల్లోనూ అలర్ట్ కొనసాగుతోంది. దీనిలో భాగంగా అనేక చోట్ల భద్రతను కట్టుదిట్టం చేశారు. దేశ రాజధాని ఢిల్లీతోపాటు పలు దేవాలయాలపై పాకిస్తాన్‌కు చెందిన లష్కరే తొయిబా అనే తీవ్రవాద సంస్థ దాడులకు కుట్ర పన్నిందని ఇంటెలిజెన్స్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఢిల్లీతోపాటు ప్రముఖ నగరాలు, ప్రధాన దేవాలయాలు వంటి రద్దీ ప్రదేశాల్ని లష్కరే తొయిబా సంస్థ టార్గెట్ చేసుకున్నట్లు నిఘా వర్గాల సమాచారం. ముఖ్యంగా ఢిల్లీలోని చారిత్రక ప్రదేశాలైన ఎర్రకోట, చాందినీ చౌక్, పరిసర దేవాలయాల్లో ఐఈడీలతో పేలుడుకు కుట్ర పన్నినట్లు తెలుస్తోంది. దీంతో అప్రమత్తమైన అధికారులు భద్రతను మరింత పెంచి హై అలర్ట్ ప్రకటించారు. అన్ని స్థాయిల్లో భద్రతను 24 గంటలు పర్యవేక్షించేలా పార్లమెంటరీ బృందాలు పని చేస్తున్నాయి. ఇటీవల పాకిస్తాన్‌లో మసీదు వద్ద మానవ బాంబు దాడిలో పలువురు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు పాకిస్తాన్ ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటోంది. దీనిలో భాగంగా పాక్‌కు చెందిన ఉగ్రసంస్థ లష్కరే తొయిబా ఇండియాలో పేలుళ్లకు ప్లాన్ చేసినట్లు రహస్య సమాచారం అందింది. దేశంలోని ప్రధాన దేవాలయాల్ని కూడా ఈ ఉగ్రసంస్థ టార్గెట్ చేసినట్లు తెలుస్తోంది. అందుకే ఆయా ప్రాంతాల్లో పోలీసులు, భద్రతా సిబ్బందిని భారీ సంఖ్యలో మోహరించారు. లష్కరే తొయిబా సంస్థకు మోస్ట్ వాంటెడ్ టెర్రిస్ట్ అయిన హఫీజ్ సయీద్ నాయకత్వం వహిస్తున్నాడు. గత ఏడాది నవంబర్ 25న ఢిల్లీలోని ఎర్రకోట వద్ద కార్ బాంబ్ బ్లాస్ట్ అయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 12 మంది మరణించగా, 20 మందికిపైగా గాయపడ్డారు.

ఎఐ అనే మాటను వింటేనే వణుకు పుడుతోంది

-మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

అమరావతి ఫిబ్రవరి 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్) : ఎఐ అనే మాటను వింటేనే వణుకు పుడుతోందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు తెలిపారు. ఎఐతో మానవ సంబంధాలు మంటగలిసిపోతాయేమోనని భయమేస్తోందని అన్నారు. ఎఐపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. విద్వేషాలు రెచ్చగొట్టకుండా..ఎఐని కట్టడి చేయాలని, విలువలతో కూడిన కృత్రిమ మేధస్సు అందించాలని నిపుణులను కోరారు. ఎఐతో వైట్ కాలర్ జాబ్స్ పోకుండా మార్గాలు అన్వేషించాలని వెంకయ్యనాయుడు సూచించారు. సోషల్ మీడియాలో నేతలు భాషను అసహ్యంగా వాడుతున్నారని, వినేందుకు కూడా వీలు లేని పదాలను నీచంగా ఉపయోగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మానవ మేధస్సుతోనే మంచి ఫలితాలు ఉంటాయని, కృత్రిమ మేధస్సు కృత్రిమంగా ఉంటుందని, ఎఐ విస్తృతం అయితే.. వినియోగంలో అనర్థాలపై అవగాహన అవసరం ఉందని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు.

అయిజలో అగ్నిప్రమాదం.. భారీగా ఆస్తి నష్టం

జోగులాంబ గద్వాల ఫిబ్రవరి 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్); జోగులాంబ గద్వాల జిల్లాలోని అయిజలో అగ్నిప్రమాదం జరిగింది. అయిజలోని ఓ ప్రైవేటు కంపెనీలో భారీగా మంటలు చెలరేగాయి. మంటలు భారీగా ఎగసిపడుతుండటంతో స్థానికులు భయంతో వణికిపోయారు. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రమాదానికి షార్ట్‌సర్క్యూటే కారణమని అగ్నిమాపక సిబ్బంది వెల్లడించారు. భారీగా ఆస్తి నష్టం జరిగినట్టు సమాచారం. ప్రాణ నష్టం గురించి ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

హైదరాబాద్‌లో విషాదం.. చికిత్స పొందుతూ శిశువు మృతి.. బంధువుల ఆందోళన..



హైదరాబాద్, ఫిబ్రవరి 21: నగరంలోని ఓ ఆస్పత్రిలో విషాద ఘటన చోటు చేసుకుంది. ఆరు నెలల శిశువు చికిత్స పొందుతూ మృతి చెందింది. అయితే సాధారణ జ్వరంతో ఆస్పత్రికి వెళ్లామని.. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ బిడ్డ ప్రాణాలు పోయాయని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే..

పోలీసుల కథనం మేరకు.. సన్ సిటీకి చెందిన దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు కాగా.. ఇటీవల బాబు జన్మించాడు. ఆరు నెలల వయసున్న బాబుకు స్వల్పంగా జ్వరం రావడంతో తల్లిదండ్రులు సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే జ్వరంతో వెళ్లిన బాబుకు.. వైద్యులు అత్యవసర సమయాల్లో ఇచ్చే ఇంజెక్షన్ ఇచ్చినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇంజెక్షన్ ఇచ్చిన కొద్ది నిమిషాల్లోనే పసికందు శరీరం రంగు మారిపోయిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఆస్పత్రి యాజమాన్యం గడువు ముగిసిన మందులు ఇచ్చిందని, దీనివల్లే తమ బిడ్డ చనిపోయాడని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇద్దరు ఆడపిల్లల తర్వాత పుట్టిన బాబు కావడంతో అల్లారుముద్దుగా చూసుకున్నామని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. శిశువు మృతి వార్త తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రికి చేరుకుని ఆందోళన చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఆస్పత్రిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ఆసుపత్రి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పార్టీలో అంతర్గతంగా భిన్నాభిప్రాయాలు ఉంటాయి

– దాన్ని ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఆలోచన చేయాలి

–వచ్చే ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలో డిసిసి అధ్యక్షులే కీలకం: సిఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ ఫిబ్రవరి 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: పార్టీలో అంతర్గతంగా భిన్నాభిప్రాయాలు ఉంటాయని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. దాన్ని ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఆలోచన చేయాలని అన్నారు. 11రోజుల పాటు డిసిసి అధ్యక్షుల శిక్షణా కార్యక్రమాలు జరగనున్నాయి. వచ్చే ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలో డిసిసి అధ్యక్షులే కీలకం అని అన్నారు. ఈ సందర్భంగా వికారాబాద్ లో సిఎం మీడియాతో మాట్లాడుతూ.. కుటుంబ త్యాగాల చరిత్ర ఉన్నా.. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ 150 రోజులు పాదయాత్ర చేశారని, మిమ్మల్ని పార్టీ అధ్యక్షుల్ని చేసిందని తెలియజేశారు. మాదే సామ్రాజ్యం అనుకుంటే, ఇక్కడి నుంచే ఫెయిల్యూర్ మొదలవుతుందని, తాను పిసిసి ప్రెసిడెంట్ అయ్యాక ఏం జరిగిందో చూశారని అన్నారు. ప్రతి నాయకుడి ఇంటికి వెళ్లానని, నచ్చ చెప్పానని, ఆ తర్వాత నేతల ఆలోచనలో మార్పు వచ్చిందని రేవంత్ పేర్కొన్నారు. అందరం కలిసి పని చేస్తే సరిగ్గా రెండున్నర ఏళ్లలో అధికారంలోకి వచ్చామని, ఎవరికి వారసత్వంగా హోదా రాలేదని చెప్పారు. 140 ఏళ్ల క్రితం ప్రారంభమైన పార్టీ, 140 కోట్ల మందికి స్ఫూర్తి నింపుతోందని, అలాంటి బిజెపి వారసతవం ఉన్నవాళ్లు బుల్లెట్ వర్షం కురిపించారని విమర్శించారు. బ్రిటీషర్ల జాతిపిత మహాత్మ గాంధీపై లాఠీ ఎత్తడానికి భయపడ్డారని, మెరిట్ కోటాలో పాస్ అయితేనే పదవులు వస్తాయని, ఒక కోటాలో మీరంతా డిసిసి అయ్యారని అన్నారు. రాజ్యాంగాన్ని మార్చి, రిజర్వేషన్లు రద్దు చేయాలనే కుట్ర జరుగుతుందని మండిపడ్డారు. 60 రోజుల్లో 40 లక్షల సభ్యత్వ నమోదు చేశారని అన్నారు. డిసిసి అధ్యక్ష పదవి విలువైందని, దాన్ని ప్రజల కోసం వాడుకోండని, లేదంటే మిమ్మల్ని ఎవరు కాపాడలేరని రేవంత్ రెడ్డి సూచించారు.

నల్గొండ జిల్లాలో అగ్నిప్రమాదం.. ఆటోమొబైల్ షాప్‌లో రూ.10 లక్షల ఆస్తి నష్టం..

నల్గొండ, ఫిబ్రవరి 21: నల్గొండ జిల్లాలో ఇవాళ(శనివారం) భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో భారీ ఆస్తి నష్టం సంభవించింది. నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని సాయి విఘ్నేశ్వర ఆటోమొబైల్ షాప్‌లో ఈ అగ్నిప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు ప్రాథమిక సమాచారం. స్థానికులు.. పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేశారు. అక్కడికి చేరుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షాప్‌లో నుంచి ఒక్కసారిగా పొగ వ్యాపించింది. కాసేపటికే మంటలు వేగంగా వ్యాపించడంతో షాపులో ఉన్న స్పేర్ పార్ట్స్, వాహనాలకు సంబంధించిన సామగ్రి అగ్నికి ఆహుతైంది. గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అయితే అప్పటికే షాప్‌లో ఉన్న సామగ్రి పూర్తిగా కాలిపోయినట్లు తెలుస్తోంది. ఈ అగ్నిప్రమాదంలో సుమారు రూ.10 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు తెలుస్తోంది.

షార్ట్ సర్క్యూట్‌తోనే..!

అగ్నిప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని అధికారులు భావిస్తున్నారు. విద్యుత్ వైర్లలో లోపం వల్ల మంటలు చెలరేగి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలుసుకునేందుకు అధికారులు విచారణ చేపట్టారు. ఈ ఘటనతో స్థానిక వ్యాపారులు అప్రమత్తమయ్యారు. విద్యుత్ పరికరాలు, వైరింగ్ వ్యవస్థలను తరచూ తనిఖీ చేయించుకోవాలని ఫైర్ సేఫ్టీ అధికారులు సూచించారు.

కౌమార యువత వ్యక్తిత్వ నిర్మాణమే ధ్యేయంగా?.!

(22 ఫిబ్రవరి "ప్రపంచ స్కౌట్స్ దినోత్సవం" సందర్భంగా)

స్కౌటింగ్ ఆలోచనలకు తుది రూపమిచ్చి వ్యవస్థాపకుడిగా పేరుగాంచిన రాబర్ట్ బాడెన్ పోవెల్‌తో పాటు వారు సహధర్మచారిణి ఓలావె బాడెన్ పోవెల్ జన్మదినం 22 ఫిబ్రవరి (1857) సందర్భంగా ప్రతి ఏట 22 ఫిబ్రవరిన ప్రపంచవ్యాప్తంగా విద్యాలయాల్లో "ప్రపంచ స్కౌట్స్ దినోత్సవం లేదా వరల్డ్ స్కౌట్స్ డే" పాటించడం ఆనవాయితీగా మారింది. విశ్వ స్కౌటింగ్ సంఘాలతో పాటు భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థలు ఘనంగా ఈ వేడుకలను నిర్వహిస్తున్నాయి. 1908లో బాయ్ స్కౌట్స్‌ను ప్రారంభించిన రాబర్ట్ బాడెన్ పోవెల్, 1910లో గర్ల్స్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌ను స్థాపించారు. విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, మానసిక పరిపక్వత, దేశభక్తి, వ్యక్తిత్వ విస్తారం, ప్రతికూలతలును ఎదుర్కోవడం, ఆధ్యాత్మిక అనుభూతులు పెంచడమే లక్ష్యంగా పాఠశాల బాలలకు సైనిక శిక్షణ తరహాలో స్కౌట్స్ అండ్ గైడ్స్ గొడుగు కింద శాస్త్రీయ శిక్షణను అనాదిగా అందించడం జరుగుతున్నది. ప్రపంచ స్కౌట్స్ దినోత్సవంలో భాగంగా విద్యార్థులు, స్కౌట్ ఆఫీసర్లు, విద్యాలయాలు ఘనంగా వేడుకలను నిర్వహిస్తున్నారు.

భారత్‌లో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమం :

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విశిష్ట సేవలను గుర్తించిన ఐరాస ప్రస్తుతిస్తూ "శాంతి దూత లేదా సందేశకులు"గా గుర్తించడం ముదావహం. భారత ప్రభుత్వ చొరవతో 1950లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రారంభం కావడంతో పాటు 1951లో ఆల్ ఇండియా గర్ల్స్ గైడ్స్ సంస్థ ఏర్పడింది. నేడు దేశవ్యాప్తంగా 57 లక్షల పిల్లలు స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణను పొందుతున్నారు. భారత్ స్కౌట్స్‌లో 3 – 5 ఏండ్ల పిల్లల్ని బన్నీస్‌గా, 5 – 10 ఏండ్ల విద్యార్థులను కబ్స్‌గా, 10 – 17 ఏండ్ల విద్యార్థులను స్కౌట్స్‌గా, 17 – 25 ఏండ్ల యువతను రేంజర్స్‌గా పిలవడం జరుగుతుంది.

తెలుగు రాష్ట్రాల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ :

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 18,510 మంది స్కౌట్స్, 15,150 మంది గైడ్స్‌గా శిక్షణ పొందుతుండగా, తెలంగాణలో 9,145 మంది స్కౌట్స్, 6,489 మంది గైడ్స్ శిక్షణ పొందుతున్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ తీసుకున్న విద్యార్థులు ఇతర విద్యార్థులతో పోల్చితే స్పష్టమైన గుణాత్మక తేడాను గమనించవచ్చు. బాధ్యత కలిగిన రేపటి పౌర సమాజ స్థాపనకు నేటి బాలలను తగు రీతిలో మలుచుకోవడానికి ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్‌లతో పాటు స్కౌట్స్ అండ్ గైడ్స్ కూడా అమూల్య సేవలను అందించడం హర్షణీయం.

22 ఫిబ్రవరి రోజున "ప్రపంచ ఆలోచనా దినం లేదా వరల్డ్ థింకింగ్ డే"ను కూడా పాటించడం జరుగుతుంది. గర్ల్ గైడింగ్, గర్ల్ స్కౌటింగ్ చిన్నారులను వినియోగించుకొని వరల్డ్ థింకింగ్ డే నిధులను కూడా సమీకరించడం జరుగుతుంది. వరల్డ్ థింకింగ్ డే–2026 ఇతివృత్తంగా "అవర్ ఫ్రెండ్‌షిప్" అనే అంశాన్ని తీసుకొన్నారు.

–ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

ఏఐ ఫర్ ఓషన్స్ ఆఫ్ టుమారో: డేటా, మాడల్స్ అండ్ గవర్నెన్స్' అంశంపై చర్చకు మార్గదర్శకత్వం వహించిన భూ విజ్ఞానశాస్త్రాల మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్–2026ను న్యూ ఢిల్లీలో 2026 ఫిబ్రవరి 16 మొదలు 20 వరకు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా 'ఏఐ ఫర్ ఓషన్స్ ఆఫ్ టుమారో: డేటా, మాడల్స్ అండ్ గవర్నెన్స్' అంశంపై ఒక ఉన్నత స్థాయి బృంద చర్చను కేంద్ర భూ విజ్ఞాన శాస్త్రాల మంత్రిత్వ శాఖ (ఎంఓఈఎస్) ఏర్పాటు చేసింది.

భారత సముద్ర ప్రాంత నిర్వహణలో, విపత్తులకు ఎదురొడ్డి నిలవడంలో, సముద్ర జీవ నోపాధుల్లో, నీలి ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిని పటిష్టపరచడంలో కృత్రిమ మేధ (ఏఐ) ఒక గొప్ప పాత్రను పోషించ గలుగుతుందని నిపుణులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రభుత్వ అధికారులు, అంతర్జాతీయ ప్రముఖులు, శాస్త్రవేత్తలు, పరిశ్రమ రంగ ప్రముఖులు, అంకుర సంస్థలు, ఆర్థిక నిపుణులు పాల్గొని మహాసాగర విజ్ఞానంతోనూ, విధానాలతోనూ ఏఐని ఏకీకరించడంపై చర్చించారు.

భారత వాతావరణ విజ్ఞాన విభాగం డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎమ్. మహాపాత్రా కీలకోపన్యాసాన్ని ఇస్తూ, వాతావరణ నియంత్రణ, వైపరీత్యాల నష్ట భయ నివారణ, ఆహార భద్రత, జీవనోపాధులలో మహాసాగరాలు పోషిస్తున్న ముఖ్య పాత్రను వివరించారు. మహాసాగర పరిశీలన, తుపానులను ముందుగా అంచనా వేయడం, సముద్ర జలాలకు సంబంధించిన సమాచార వ్యవస్థలు, ముందస్తు హెచ్చరిక సేవల్లో భారత్ పటిష్టమైన జాతీయ సామర్థ్యాల్ని కలిగి ఉందని చెబుతూ, విపత్కర వాతావరణ స్థితుల వేళ వాటిల్లే ప్రాణ, ఆస్తి నష్టాలను సాంకేతిక పురోగతి చాలావరకూ తగ్గించి వేసిందన్నారు. మహాసాగరాలు వెచ్చబడడం, ఆమ్లీకరణం, సముద్ర నీటి మట్టం వృద్ధి వంటి వాతావరణ మార్పు ప్రభావాలు ఏర్పడిన సందర్భంలో సాంప్రదాయిక భౌతిక నమూనాలకు పూరకంగా డేటా–ఆధారిత, ఏఐ–ఆధారిత నమూనాలు ప్రాధాన్యాన్ని సంతరించుకొంటాయని ఆయన తన ప్రసంగంలో తెలిపారు. సముద్ర అంతర్భాగంలోకి పోయి అన్వేషణను కొనసాగించడం, సముద్ర తీరానికి ఆవల ఇంధన వసతుల ఏర్పాటు, జీవ వైవిధ్య సంరక్షణ, సముద్ర వనరుల్ని నిరంతర ప్రాతిపదికన ఉపయోగించుకోవడం వంటి వాటిపై దృష్టిని కేంద్రీకరించిన ఒక ప్రధాన జాతీయ కార్యక్రమమే డీప్ ఓషన్ మిషన్ అని వర్ణించారు.

భారత్‌లో నార్వే రాయబారి మే–ఎలిన్ స్టేనర్ కార్యక్రమంలో మాట్లాడుతూ మహాసాగరాల రంగంలోనూ, నీలి ఆర్థిక వ్యవస్థలోనూ భారత్, నార్వేల సహకారం అంతకంతకూ పెరుగుతోందన్నారు. కృత్రిమ మేధని ఆంక్షలకు తావు ఉండని (ఓపెన్), అంతర నిర్వహణీయ (ఇంటరాపరబుల్) తరహా, విశ్వసనీయ డిజిటల్ పునాదులతో అభివృద్ధిఐ రించినప్పుడు.. మత్స్య పరిశ్రమ నిర్వహణ, షిపింగ్ సామర్థ్యం, నౌకాశ్రయ కార్యకలాపాలు, కోస్తా తీరాన్ని బలోపేతం చేసుకోవడం సాధ్యపడుతుందని ఆమె చెప్పారు. డిజిటల్ సార్వజనిక సేవల కల్పనలో భారత్ అగ్రగామిగా రూపొందడంతో ఓపెన్ డేటా, ఉమ్మడి ప్రమాణాలు, బాధ్యతాయుత డిజిటల్ పరిపాలనలపై ఆధారపడ్డ ఒక ప్రపంచ డిజిటల్ మహాసాగర సంబంధిత మౌలిక సదుపాయాల ప్రణాళికకు రూపురేఖలను అందించే స్తోమతను కల్పిస్తుందనీ, ఇది ఒక్క భారత్‌కే కాకుండా అంతర్జాతీయ సమాజానికి కూడా మేలు చేసేదే అవుతుందన్నారు.

కార్యక్రమంలో రెండో సగభాగంలో ప్రభుత్వం, విద్యాజగతి, పరిశ్రమ, అంతర్జాతీయ సంస్థలకు చెందిన నిపుణులతో ఓ బృంద చర్చను చేపట్టారు. భారత్ ఆంక్షలకు సమాచారనిధి (ఓపెన్ డేటా), కృత్రిమ మేధ (ఏఐ) చోదకశక్తిగా నిలిచే సమాచారం, పటిష్ఠ పాలన ప్రణాళికలను ఏకీకరించే డిజిటల్ మహాసాగర మౌలిక సదుపాయాల కల్పనకు నడుం బిగించి అభివృద్ధి చెందుతున్న దేశాల (గ్లోబల్ సౌత్)కు నాయకత్వం వహించడానికి ఎంతో సమర్థమైం దిగా ఉందని బృందం అభిప్రాయపడింది.

సముద్ర సంబంధిత జీవనోపాధులను ప్రోత్సహించేందుకు, నిర్వహణ కార్యకలాపాల ఖర్చులను తగ్గించేందుకు, నీలి ఆర్థిక వ్యవస్థకు చెందిన అన్ని రంగాల్లో కాలానుగుణంగా డేటా–ఆధారిత నిర్ణయాల్ని తీసుకోవడంలో కృత్రిమ మేధ ఎంతయినా అవసరమవుతుంది. డేటాసెట్లు అంతకంతకూ వృద్ధి చెందుతున్నప్పటికీ, మహాసాగరాలు అత్యంత సంక్లిష్టమైన, డేటా కొరవడిన రంగంగా మిగిలాయి. ఈ నేపథ్యంలో భౌతికతపై ఆధారపడ్డ ఏఐ, భౌతిక ఇంటెలిజెన్సులను అభివృద్ధివరచక తప్పదు. మహాసాగరాలకు సంబధించిన ఏఐలో పురోగతి కోసం ఉన్నత స్థాయి అంతర్జాతీయ సహకారం, ఓపెన్, ఇంటర్ ఆపరబుల్ ఫ్రేంవర్కులతో పాటు ఉమ్మడి డిజిటల్ సార్వజనిక వస్తువులు అవసరపడతాయి. ఇది ఎల్లలు లేనటువంటి మహాసాగరాల స్వభావాన్ని కళ్లకు కడుతుంది. సహాయం ప్రధానంగా రూపొందించే విధానాలు, డేటా మార్పిళ్లు, నిధుల కలబోత, నష్టభయాన్ని పంచుకొనే ఏర్పాట్లు జరిగాయంటే వీటితో నీలి ఆర్థిక వ్యవస్థ ఒక స్థిర ప్రాతిపదికను కలిగివుండే దీర్ఘకాలిక అభివృద్ధి ఇంజనుగా మారగలుగుతుంది. అప్పుడు ఒక్క భారత్‌కే కాక, అభివృద్ధి కోసం తపిస్తున్న దేశాల (గ్లోబల్ సౌత్)కు కూడా ఉపాధి, పెట్టుబడి అవకాశాలు పెద్ద ఎత్తున లభిస్తాయి.జీ కేటగిరీ శాస్త్రవేత్త, భూ విజ్ఞానశాస్త్రాల మంత్రిత్వ శాఖకు సలహాదారు డాక్టర్ (కమాండర్) పి.కె. శ్రీవాస్తవ ప్రసంగంతో కార్యక్రమాన్ని ముగించారు. ఆయన మహాసాగరాలకు సంబంధించిన కార్యక్రమాల్లో కృత్రిమ మేధను ఏకీకరించడానికి ఒక బాటను వరచడంలో మంత్రిత్వ శాఖ నిబద్ధతను పునరుద్ఘాటించారు.

ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ రాష్ట్రపతితో భేటీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ ఈ రోజు (2026 ఫిబ్రవరి 20) రాష్ట్రపతి భవన్‌లో భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ముతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.

మానవాళి మొత్తానికి ప్రయోజనం చేకూరేలా కృత్రిమ మేధ విషయంలో అంతర్జాతీయ సైంటిఫిక్ ప్యానల్‌ను ఏర్పాటు చేయాలన్న ఆంటోనియో గుటెరస్ ప్రతిపాదనను రాష్ట్రపతి సాదరంగా స్వాగతించారు. .

ఏఐ ఇంపాక్ట్ సదస్సును విజయవంతంగా నిర్వహించడంలో భారత్ పోషించిన నాయకత్వ పాత్ర, వివిధ రంగాలలో ఐక్యరాజ్యసమితితో భారత్‌కు ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని ప్రధాన కార్యదర్శి అభినందించారు.

ప్రస్తుత ప్రపంచ అనిశ్చితుల సమయంలో బహుపాక్షికవాదం తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటోందని, దేశాల మధ్య విశ్వసనీయత లోటు పెరుగుతోందని రాష్ట్రపతి పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో ఉన్న పాత వ్యవస్థను తప్పనిసరిగా ప్రస్తుత భౌగోళిక–రాజకీయ వాస్తవ పరిస్థితులను అనుగుణంగా సంస్కరించాలని, నిర్ణయాధికారాల్లో 'గ్లోబల్ సౌత్'కు తగిన ప్రాధాన్యత ఉండాలని ఆమె తెలిపారు. ఐక్యరాజ్యసమితికి ఉన్న ప్రాముఖ్యత, ప్రభావాన్ని కాపాడుకోవడానికి భద్రతా మండలిలో తక్షణ సంస్కరణలే కీలకమని ఆమె ఉద్ఘాటించారు.

'యూఎన్ –80' కార్యక్రమం సంస్కరణలకు ఒక మంచి వేదికను అందిస్తున్నప్పటికీ ఏవైనా పునర్‌వ్యవస్థీకృత ప్రక్రియలు చేపట్టినప్పుడు 'గ్లోబల్ సౌత్' అభివృద్ధి ప్రాధాన్యతలు దెబ్బతిన కుండా రక్షించటం చాలా ముఖ్యమని రాష్ట్రపతి పేర్కొన్నారు.

ప్రారంభమైన రాష్ట్రస్థాయి ఆర్థోపెడిక్ సదస్సు

–వెయ్యికి పైగా పాల్గొన్న వైద్యులు..

కర్నూలు, ఫిబ్రవరి 21: ఆర్థోపెడిక్ శాస్త్ర రంగంలో తాజా వైద్య పరిజ్ఞానం, ఆధునిక చికిత్సా విధానాలపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఆర్థోపెడిక్ సర్జన్స్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 55వ OSSAPOCON–2026 రాష్ట్రస్థాయి మూడు రోజుల ఆర్థోపెడిక్ కాన్ఫరెన్స్ కర్నూలు మెడికల్ కాలేజ్‌లో ఘనంగా ప్రారంభమైంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆర్థోపెడిక్స్, కర్నూలు మెడికల్ కాలేజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ రఘునందన్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్థోపెడిక్ వైద్యం కేవలం ఎముకల చికిత్సకే పరిమితం కాకుండా రోగి జీవన నాణ్యతను మెరుగుపరిచే కీలక వైద్య విభాగమని పేర్కొన్నారు. 1992లో కర్నూలు మెడికల్ కాలేజీలో సీనియర్ ఆర్థోపెడిక్ వైద్యుడు శేషన్న ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించబడినట్లు గుర్తుచేశారు. రాష్ట్ర విభజన అనంతరం 34 సంవత్సరాల తర్వాత మళ్లీ కర్నూలులో ఈ రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించ బడటం గర్వకారణమని తెలిపారు.

దేశ విదేశాల నుంచి, రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యికి పైగా వైద్యులు హాజరవడం సదస్సు ప్రాధాన్యతను చాటుతోందన్నారు. ఈ సదస్సులో క్లిష్టమైన, అధునాతన ఆర్థోపెడిక్ శస్త్రచికిత్సా విధానాలపై ప్రదర్శనలు, పేపర్ ప్రజెంటేషన్లు నిర్వహించబడతాయని చెప్పారు. ఆధునిక సాంకేతికత, మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీలు, ట్రామా కేర్, జాయింట్ రీప్లేస్‌మెంట్ వంటి రంగాల్లో నిరంతర నవీకరణలు అవసరమని సూచించారు. రాష్ట్రస్థాయి కాన్ఫరెన్సులు యువ వైద్యులు, సీనియర్ సర్జన్ల మధ్య జ్ఞాన మార్పిడికి వేదికలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. మెడికల్ ఎడ్యుకేషన్ వ్యవస్థలో రీసెర్చ్, స్కిల్ డెవలప్‌మెంట్, పేషెంట్ సేఫ్టీ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు.

ప్రభుత్వ వైద్య కళాశాలలు శిక్షణతో పాటు సేవాభావాన్ని పెంపొందించాల్సిన బాధ్యత వహిస్తున్నాయని అన్నారు. సదస్సులో రాష్ట్రవ్యాప్తంగా మరియు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రముఖ ఆర్థోపెడిక్ నిపుణులు పాల్గొని ట్రామా మేనేజ్‌మెంట్, స్పైన్ సర్జరీ, జాయింట్ రీప్లేస్‌మెంట్, స్పోర్ట్స్ ఇంజరీలు, పిల్లల ఆర్థోపెడిక్స్ తదితర అంశాలపై చర్చలు, డిబేట్లు, పేపర్ ప్రజెంటేషన్లు నిర్వహించనున్నారు.

ఈ కార్యక్రమంలో ఏడీఎంఈ, ప్రిన్సిపాల్ డా. చిట్టి నరసమ్మ, ఏడీఎంఈ, సూపరింటెండెంట్ డా. వెంకటేశ్వర్లు, ఓసాప్కాన్ ప్రెసిడెంట్ డా. అశోక్ కుమార్, సెక్రటరీ డా. విజయ కృష్ణారెడ్డి, ఆర్గనైజింగ్ చైర్మన్ డా. శ్రీనివాసులు, సెక్రటరీలు ఇలియాస్ భాష, కో–చైర్మన్ డా. రమణ, సైంటిఫిక్ కమిటీ సభ్యులు డా. రాజయ్య, డా. అచ్యుత రావు, జాయింట్ సెక్రటరీ డా. రాజేష్, ఏపీఎంసీ అబ్జర్వర్ డా. వెంకట రమణ పాల్గొన్నారు.

వ్యర్థాల ఉత్పత్తిని తగ్గించాలి

–పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంలో ప్రజల భాగస్వామ్యం చాలా కీలకం

–జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

కర్నూలు, ఫిబ్రవరి 21: ప్రతి ఒక్కరూ 'జీరో–వ్యర్థాల జీవనశైలిని అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు. శనివారం కలెక్టరేట్ లో "జీరో

లిట్టర్ గవర్నెన్స్" అనే థీమ్ తో నిర్వహించిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అధికారులు పాల్గొన్నారు. తొలుత కలెక్టరేట్ నుండి అధికారులతో కలిసి ర్యాలీ నిర్వహించిన అనంతరం స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా "జీరో లిట్టర్ గవర్నెన్స్" అనే థీమ్ తో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రమైన వాతావరణం సాధ్యమని, ప్రతి ఒక్కరూ 'జీరో–వేస్ట్' జీవనశైలిని అలవర్చుకోవాలని కలెక్టర్ కోరారు. వ్యర్థాల ఉత్పత్తిని తగ్గించాలని, రీసైక్లింగ్, తిరిగి ఉపయోగించడం లాంటి పద్ధతుల ద్వారా పర్యావరణ ప్రయోజనం కలుగుతుందన్నారు.

ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా, తడి చెత్త మరియు పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించి తమ పంతు సహకారం అందించాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడొద్దని, పర్యావరణ హిత వస్తువులనే వాడాలన్నారు. డ్రైనేజీలను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని, అదే విధంగా డీ–సిల్టేషన్ పనులు చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ పారిశుధ్య కార్మికులను ఆదేశించారు. ఈ సారి సుమారు 40 నుండి 45 లక్షల మొక్కలు నాటడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని కలెక్టర్ తెలిపారు.

ఇప్పటికే ఉన్న పాత చెత్తను తొలగించడంతో పాటు, కొత్తగా చేరే ఘన మరియు ద్రవ వ్యర్థాలను శుద్ధి చేయడానికి వివిధ దశల్లో టెండర్ల ప్రక్రియలు జరుగుతున్నాయన్నారు. అక్కడే ఉన్న పారిశుధ్య కార్మికులతో కలెక్టర్ మాట్లాడుతూ పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించే సమయంలో ఖచ్చితంగా గ్లౌస్‌లు, మాస్క్‌లు ధరించాలని కలెక్టర్ సూచించారు... పనిముట్లు ఇస్తున్నారా.. లేదా.. సరైన సమయానికి జీతం వస్తుందా.. లేదా.. అని కలెక్టర్ పారిశుధ్య కార్మికులను ఆరా తీశారు. పారిశుధ్య కార్మికులు పోషకాహారాన్ని తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని కలెక్టర్ పారిశుధ్య కార్మికులకు సూచించారు. కార్యక్రమంలో డిపిఓ భాస్కర్, కలెక్టరేట్ ఏఓ శివరాముడు, పాల్గొన్నారు..

ఆత్మకూర్(ఎం)లో 'పీఎం ముద్రా యోజన'పై అవగాహన

నల్గొండ, ఫిబ్రవరి 21: ఎంఎస్ఎంఈ–ర్యాంప్ కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిశ్రమల కేంద్రంలోని ఈడిసీ మేనేజర్ కుమ్మరికుంట్ల రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో ఆత్మకూర్(ఎం) మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో శనివారం ప్రధానమంత్రి ముద్ర యోజనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐవీఎల్‌వో ట్రైనర్ హేమాద్రి మాట్లాడుతూ.. ముద్ర రుణాలైన శిశు, కిషోర్, తరుణ్ వివరాలు, అర్హతలు, పత్రాలు, రీపేమెంట్, వ్యాపారం ఎలా చేసుకోవాలి, దాని విధి విధానాలపై అవగాహన కల్పించారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ శివ రామకృష్ణ మాట్లాడుతూ.. అర్హులైన వారు సరైన పత్రాలతో బ్యాంకును సంప్రదిస్తే ముద్ర రుణాలు సులభంగా మంజూరు అవుతాయని తెలిపారు.

రుణాల విషయంలో బ్యాంకుల విధి విధానాలు, షరతులు వివరించారు. ఎంఎస్ఎంఈ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వ్యాపార అవకాశాలు పెంచడమే లక్ష్యమని, వ్యాపారం ప్రారంభించాలనుకునే వారు ఈడిసీని సంప్రదించాలని లీడ్ బ్యాంక్ ఆఫీసర్ వంశీ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్, తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజరు ప్రశాంత్ కుమార్, ఈడీసీ అసిస్టెంట్ మేనేజర్ మహేష్, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పల్లవి పాల్గొన్నారు.

స్మార్ట్‌కార్డుల పేరిట రూ75 కోట్లు వృథా!.. ఒక్కో 'ఫ్రీ బస్' కార్డు తయారీకి రూ.1,500

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్);) : ఒక వైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదంటూనే కాంగ్రెస్ సర్కార్ దుబారా ఖర్చుకు వెనుకాడటం లేదు. అందాల పోటీలు, మెస్సీతో మ్యాచ్ కోసం కోట్లు ఖర్చు చేసి ప్రజల్లో అభాసుపాలైన విషయం తెలిసిందే. ఇక తాజాగా మహిళలకు ఫ్రీ బస్సు ప్రయాణంలో భాగంగా చిప్‌తో కూడిన స్మార్ట్‌కార్డుల తయారీకి రూ.75కోట్లు ఖర్చు చేయనున్నట్టు సమాచారం. జూన్ 2 నుంచి ఈ కార్డులను ఇవ్వాలని సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు తెలిసింది. ఆర్టీసీ ఇప్పటికే ఈ మొత్తం ఆర్థిక సాయం రూపంలో ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్టు సమాచారం. అయితే తొలుత జిల్లాకో మండలంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. ఈ ప్రతిపాదనపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం రాష్ట్రంలో 5 లక్షల మందికి రూ.75 కోట్లు ఖర్చు అయితే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దాదాపు 2కోట్ల మహిళలకు కార్డులు ఇవ్వాలంటే ఎంత ఖర్చు కావాలనే చర్చ మొదలైంది. ఒక్కో కార్డుకు రూ.1,500 ఖర్చు అవుతుందా అనే ప్రశ్న అవుతున్నది.

ఒక దేశంలో ఇంధన వ్యవస్థలు బలహీనంగా ఉంటే, ఆ దేశ మేధో వ్యవస్థలు కూడా బలహీనంగానే ఉంటాయి: అదానీ డిజిటల్ ల్యాబ్స్ డైరెక్టర్ జీత్ అదానీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్ 2026 ను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 140 కోట్ల మంది భారతీయులు కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చు కోవడానికి ఆతృతతో ఉన్నారని పేర్కొన్నారు. వారి తరపున, ఈ సదస్సులో పాల్గొంటున్న వివిధ దేశాల ప్రభుత్వ అధినేతలకు, గ్లోబల్ ఏఐ వ్యవస్థల నేతలకు, ఆవిష్కర్తలకు ఆయన సాదర స్వాగతం పలికారు.

ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్ 2026 సందర్భంగా మిస్ట్రల్ ఏఐ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు ఆర్థర్ మెన్స్, ఫెడెక్స్ సీఈఓ రాజేష్ సుబ్రమణ్యం, అదానీ డిజిటల్ ల్యాబ్స్ డైరెక్టర్ జీత్ అదానీ, ఖోస్లా వెంచర్స్ వ్యవస్థాపకులు వినోద్ ఖోస్లా కీలకోపన్యాసాలు చేశారు. కృత్రిమ మేధ సార్వభౌమాధికారాన్ని, ప్రపంచ వాణిజ్యాన్ని, మౌలిక సదుపాయాలను, ప్రాథమిక సేవల లభ్యతను ఏ విధంగా పునర్నిర్మిస్తోందో వారు విశ్లేషించారు. ఈ సందర్భంగా పారదర్శకత, యాజమాన్య హక్కులు, భారీ స్థాయి సామాజిక ప్రభావం గురించి వారు ప్రధానంగా వివరించారు.

మిస్ట్రల్ ఏఐ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు ఆర్థర్ మెన్స్ మాట్లాడుతూ, ఏఐ స్వయం ప్రతిపత్తి, అందరితో కలసి ఆవిష్కరణలు చేయవలసిన ఆవశ్యకతను వివరించారు. వికేంద్రీకరణ, డిజిటల్ స్వయంప్రతిపత్తిని ఉద్ఘాటిస్తూ "ఏఐ అనేది సాధికారతకు ఒక సాధనంగా ఉండాలి, ఆధిపత్యం కోసం కాదు. దేశాలు, ప్రాంతాలు తమ ఏఐ భవిష్యత్తుపై సొంత అధికారాన్ని కలిగి ఉండాలి. ఇది ఒక ప్రత్యేక హక్కు కాదు, డిజిటల్ స్వయంప్రతిపత్తిని కాపాడుకోవడానికి ఒక అవసరం" అని అన్నారు. అధికార కేంద్రీకరణ పెరిగిపోవడంపై హెచ్చరిస్తూ "కేవలం మూడు లేదా నాలుగు భారీ కంపెనీలకే కృత్రిమ మేధ అందుబాటులో ఉండే ప్రపంచాన్ని మనం కోరుకోవడం లేదు. భవిష్యత్తు అనేది అందరి చేత, అందరి కోసం నిర్మాణం కావాలి" అని పేర్కొన్నారు.

ఫెడెక్స్ సీఈఓ రాజేష్ సుబ్రమణ్యం మాట్లాడుతూ, తర్వాతి పారిశ్రామిక యుగానికి, ముఖ్యంగా ప్రపంచ సరఫరా వ్యవస్థలకు ఏఐ ఒక పునాది మాదిరి మౌలిక సదుపాయమని పేర్కొన్నారు. తమ సంస్థలో వస్తున్న మార్పులను ప్రస్తావిస్తూ, ఏఐ అనేది ఇకపై కేవలం ఒక ట్రెండ్ మాత్రమే కాదని, ఇది తదుపరి పారిశ్రామిక వ్యవస్థ అని అన్నారు. మేధస్సు అనేది ఒక ఆస్తి కాదు, అది ఒక మౌలిక సదుపాయం" అని స్పష్టం చేశారు. అవకాశాల విస్తృతిని ప్రస్తావిస్తూ "రాబోయే 50 సంవత్సరాల్లో, ఆధునిక వాణిజ్యాన్ని నడిపించే మేధస్సును సమన్వయం చేయడం, అంతరాయాలను ముందుగానే అంచనా వేయడం, పెట్టుబడుల ప్రవాహాలను సమర్థవంతంగా మెరుగుపరచడం, దృఢమయిన సరఫరా వ్యవస్థలను నిర్మించడం ద్వారానే మన ప్రత్యేకత చాటుకోగలం" అన్నారు.

అదానీ డిజిటల్ ల్యాబ్స్ డైరెక్టర్ జీత్ అదానీ మాట్లాడుతూ, జాతీయ సామర్థ్యం, వ్యూహాత్మక సార్వభౌమాధికారం అనే కోణంలో ఏఐని విశ్లేషించారు. ఇంధనం, కంప్యూట్, సేవల సార్వభౌమాధికారాన్ని మూడు నిర్వచనాత్మక స్తంభాలుగా పేర్కొంటూ "ఏఐ అనేది కోడ్ రూపంలో ఉంటుంది. కానీ అది విద్యుత్తుపై నడుస్తుంది. ఒక దేశంలో ఇంధన వ్యవస్థలు బలహీనంగా ఉంటే, ఆ దేశ మేధో వ్యవస్థలు కూడా బలహీనంగానే ఉంటాయి" అన్నారు. పర్యావరణ హిత, స్వయంప్రతిపత్తి గల ఏఐ మౌలిక సదుపాయాలలో భారీ పెట్టుబడులను ప్రకటిస్తూ, "ఏఐ శకంలో భారత్ భాగస్వామి అవుతుంద

ప్రజలకు స్వచ్ఛమైన నీరు, గాలి ఇవ్వాలన్నదే తమ ఉద్దేశం

–వారానికి ఒకసారి మండలానికి, గ్రామానికి స్వచ్ఛ రథం: సిఎం చంద్రబాబు

అమరావతి ఫిబ్రవరి 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: వారానికి ఒకసారి మండలానికి, గ్రామానికి స్వచ్ఛ రథం వస్తుందని ఎపి సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. పాత వస్తువులు ఇస్తే బదులుగా నిత్యావసరాలు ఇస్తారని అన్నారు. పల్నాడు జిల్లా– వినుకొండలో స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు మీకు ఆదాయం వస్తుందని, 108 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయిందని అన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన నీరు, గాలి ఇవ్వాలన్నదే తమ ఉద్దేశం అని.. అందుకే ప్రతి మూడో శనివారం స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్రలో పాల్గొంటానని అన్నారు. విశాఖలో చెత్త నుంచి కరెంటు తయారు చేస్తున్నారని, మరో ఐదు ప్లాంట్ల ద్వారా కరెంటు తయారు చేస్తామని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రాష్ట్రంలో బ్యాన్ చేశామని చెప్పారు. మార్చి 31 కల్లా వందశాతం ఇంటినుంచి చెత్త సేకరించేలా చేస్తామని, చెత్త ద్వారా మళ్లీ వస్తువుల ఉత్పత్తులు చేస్తామని సిఎం పేర్కొన్నారు. టెక్నాలజీ వినియోగంలో మనమే నెంబర్ వన్ అని..వ్యవసాయంలోనూ ఎఐ సేవలు అందుబాటులోకి తెస్తున్నామని అన్నారు. ఎన్ డిఎ కూటమి రాష్ట్రంలో పెను మార్పులు తీసుకురా బోతుందని, సూపర్ సిక్స్..సూపర్ హిట్ చేశామని తెలియజేశారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా చేస్తామని, స్త్రీశక్తి, దీపం పథకం అమలు చేస్తున్నామని చెప్పారు. పేదల ఆదాయం పెంచేందుకు పి4 పథకం ఉందని, టెక్నాలజీ వినియోగాన్ని మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ మెచ్చుకున్నారని అన్నారు. పల్నాడు అంటే పౌరుషాల గడ్డ అని.. పల్నాడు వస్తే బ్రేక్ఫాస్ట్ వస్తాయని, శివరాత్రి అంటే కోటప్పకొండ ప్రభలు ప్రత్యేకం అని కొనియాడారు. ఎఐ సదస్సులో కాంగ్రెస్ తీరు ఆవవేదన కలిగించిందని, కాంగ్రెస్ తీరు దేశానికి మంచిది కాదని సూచించారు. దేశానికి, రాష్ట్రానికి ఎవరు మంచి చేస్తున్నారో ప్రజలు గమనించాలని, దేశానికి ఎంతో మేలు చేసే కార్యక్రమాలకు అండగా నిలవాలని కోరారు. కొందరు అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా బూతులు మాట్లాడుతున్నారని విమర్శించారు. ంశ్రీబనీ ఖీవజీట – ఇదో చేదు అనుభవం.. గుణపాఠం నేర్చుకుంటాం: ఆసీస్ కెప్టెన్ రెచ్చగొట్టే పనులు చేస్తున్నారని, తప్పులు చేసిన వాళ్లు అఘాయిత్యం చేసుకునే పరిస్థితి వస్తుందని మండిపడ్డారు. అసెంబ్లీలో తన సతీమణిని కూడా అవమానించారని, 23 క్లైమోర్ మైన్స్ ప్రయోగించినా తాను భయపడనని అన్నారు. వెంకటేశ్వరస్వామి స్వయంగా తనను కాపాడారని, వెంకటేశ్వరస్వామిని అపవిత్రం చేస్తే ఊరుకోనని హెచ్చరించారు. మాజీ మంత్రి, దివంగత నేత వైఎస్ వివేకానంద రెడ్డి హత్యను గుండె పోటు అని నమ్మించే ప్రయత్నం చేశారని, నారాసుర రక్త చరిత్ర అంటూ తనపై నెపం నెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. వివేకా హత్య చుట్టూ నాటకాల రాయుడు నాటకాలు ఆడారని, ఇప్పుడు కూడా లడ్డూ కల్తీ చేసి హెరిటేజ్ పేరు తీసుకొస్తున్నారని ధ్వజమెత్తారు. తాను ప్రాణం పోయినా తప్పు చేయనని, లడ్డూ ప్రసాదానికి వాడింది నెయ్యే కాదని సిట్ చెప్పిందని తెలిపారు.

నష్టపరిహారం వెంటనే చెల్లించాలి

–జాప్యం చేస్తే కలెక్టరేట్ దిగ్బంధనానికి దిగుతాం

కర్నూలు, ఫిబ్రవరి 21: 2021 ఖరీఫ్ సీజన్‌లో కావేరి జాదూరకం పత్తి విత్తనాలు విత్తి తీవ్ర నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం వారి ఖాతాల్లో జమ చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. జాప్యం కొనసాగితే కలెక్టర్ కార్యాలయాన్ని దిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ కార్యాలయం ముందు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బాధిత రైతులు ధర్నా నిర్వహించారు.

కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. ప్రభాకర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జి. రామకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ కమిషనర్ ఇచ్చిన ఆదేశాలను వెంటనే అమలు చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వారి వివరాల ప్రకారం 2021 ఖరీఫ్ సీజన్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లా లోని 18 మండలాల్లో 1,889 మంది రైతులు కావేరి జాదూ రకం పత్తి పంటను సాగు చేశారు. అయితే కంపెనీ నకిలీ విత్తనాలు సరఫరా చేయడం వల్ల పంట దిగుబడి రాకపోయిందని తెలిపారు.

రైతుల ఆందోళనల నేపథ్యంలో శాస్త్రవేత్తలు పరిశీలించి మూడు నుండి ఏడు క్వింటాళ్ల వరకు దిగుబడి నష్టం జరిగినట్లు నివేదిక ఇచ్చారని పేర్కొన్నారు. జరిగిన నష్టానికి పరిహారంగా ఎకరాకు రూ.23,107 చొప్పున చెల్లించాలని కలెక్టర్ అధ్యక్షతన ఉన్న కమిటీ కంపెనీని ఆదేశించిందన్నారు. ఐదేళ్లు గడిచినా కంపెనీ ఒక్క పైసా కూడా చెల్లించకుండా రైతులను కోర్టులు, కమిషనర్ కార్యాలయాల చుట్టూ తిప్పుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైకోర్టులో స్టే కోసం కంపెనీ చేసిన ప్రయత్నాన్ని వెనక్కు పంపి కమిషనర్ వద్ద అప్పీల్ చేసుకోవాలని సూచించినట్లు తెలిపారు.

అనంతరం కమిషనర్ అధ్యక్షతన విచారణ జరిపి తుది తీర్పులో 40 శాతం నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించారని చెప్పారు. అయినప్పటికీ ఇప్పటివరకు ఆ మొత్తాన్ని కూడా చెల్లించకుండా కాలయాపన చేయడం క్షమించరానిదని మండిపడ్డారు. వ్యవసాయ శాఖ కమిషనర్ ప్రకటించిన 40 శాతం అయినా వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేసి ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కలెక్టర్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి దిగ్బంధనానికి దిగుతామని హెచ్చరించారు.

ధర్నా అనంతరం రైతు సంఘం ప్రతినిధులు కలెక్టర్ డాక్టర్ సిరిని కలిసి వినతిపత్రం అందజేశారు. సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఏ. కృష్ణ, జిల్లా నాయకులు జి. ఆంజనేయులు, కావేరి కంపెనీ బాధిత రైతుల కమిటీ నాయకులు శివారెడ్డి, పెద్దారెడ్డి, నగేష్, కృష్ణారెడ్డి, మాణిక్యాలరెడ్డి, వెంకటరాముడు, భూపనపాడు రాజు, రంగన్న, జగన్నాథం, మహేశ్వర్‌రెడ్డి, కే. గిడ్డయ్య, భాస్కరరెడ్డి, రమణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వేణుగోపాల్, అశోక్‌కుమార్, ఎర్రమద్దిలేటి, ఎల్లయ్య, శేఖర్ అన్న, కే. నారాయణ తదితరులు పాల్గొ న్నారు.

ఐదు లక్షలు లంచం తీసుకుంటూ దొరికిపోయిన బీజేపీ ఎమ్మెల్యే.. అరెస్ట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: కర్ణాటకలో ప్రతిపక్ష బీజేపీ ఎమ్మెల్యే చంద్రులామని లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. కాంట్రాక్టర్ల నుంచి రూ.5 లక్షలు లంచం తీసుకుంటుండగా లోకాయుక్త అధికారులు వలవేసి పట్టుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే చంద్రులామనిని అరెస్టు చేశారు. ఈ ఘటన కర్ణాటక, గదగ్ జిల్లాలో శనివారం జరిగింది. అరెస్టైన ఎమ్మెల్యే చంద్రులామని షిరాహట్టి అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు.

గదగ్ జిల్లాలో నీటి పారుదల శాఖకు సంబంధించి చేపట్టిన ఒక పనికి అనుమతి, ఆమోదం కోసం విజయ్ పూజార్ అనే క్లాస్–1 కాంట్రాక్టర్ నుంచి ఎమ్మెల్యే చంద్రు లంచం డిమాండ్ చేశాడు. అనుమతులు ఇచ్చి క్లియరెన్స్ రావాలంటే తనకు రూ.11 లక్షలు చెల్లించాల్సిందే అని పట్టుబట్టాడు. దీంతో కాంట్రాక్టర్ కర్ణాటకలో అవినీతి నిరోధక విభాగం అయిన లోకాయుక్తకు ఫిర్యాదు చేశాడు. అతడి ఫిర్యాదుతో లోకాయుక్త పోలీసులు వలపన్ని ఎమ్మెల్యేను నేరుగా పట్టుకునేందుకు ప్లాన్ వేశారు. సీనియర్ అధికారుల సలహాతో ఎమ్మెల్యేను పట్టుకునేందుకు తగిన ట్రాప్ రూపొందించారు. లంచంతో పట్టుబడ్డ తర్వాత తప్పించుకునేందుకు వీలు లేకుండా, తగిన ఆధారాలు సేకరించేలా ఈ ట్రాప్ నడిపించారు. అధికారులు ఊహించినట్లుగానే ఎమ్మెల్యే.. కాంట్రాక్టర్ దగ్గరి నుంచి లంచం తీసుకున్నాడు.రూ.11 లక్షలకుగాను, అడ్వాన్స్‌గా రూ.5 లక్షలు తీసుకోగా అధికారులు ఎమ్మెల్యేను పట్టుకున్నారు. అతడిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే ఈ కేసుతో సంబంధం ఉన్న ఎమ్మెల్యే అనుచరులు ఇద్దరిని కూడా అరెస్టు చేశారు. పూర్తి ఆధారాలతో ముగ్గురిని పట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. దీనిపై ఇంకా విచారణ కొనసాగుతోంది. కర్ణాటకలో లంచాలు, అవినీతిని అరికట్టడంలో లోకాయుక్త కీలకంగా పని చేస్తోంది.

విజయాల నుంచి బలమైన పునాది దిశగా... బాధ్యతాయుత భవిష్యత్తు వైపు

కృత్రిమ మేధ అడుగులు వేస్తోందన్న ప్రపంచ సాంకేతిక రంగ సీఈఓలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్–2026లో భాగంగా కీలకోపన్యాసాలిచ్చిన వారిలో పాలో ఆల్టో నెట్‌వర్క్స్ సీఈఓ శ్రీ నికేశ్ అరోరా, హెచ్‌సీఎల్ టెక్ చైర్‌పర్సన్ రోష్నీ నాడార్, ఎన్ఎక్స్‌పీ సెమీకండక్టర్స్ సీటీఓ శ్రీ లార్స్ రేగర్, సర్వీస్‌నౌ ప్రెసిడెంటు, సీపీఓ, సీఓఓ శ్రీ అమిత్ జవేరీ ఉన్నారు. కృత్రిమ మేధ (ఏఐ) ఎలా ఒక నిర్ణయాత్మక దశలోకి అడుగు పెడుతోందో వారు ప్రస్తావించారు. కృత్రిమ మేధను అది శరవేగంగా విస్తరిస్తున్న క్రమంతో కాక, అది సంపాదించుకొనే నమ్మకం, అందించే భద్రత, పాలన, విస్తరణయోగ్య మౌలిక సదుపాయాల వంటి తక్షణావసరాల ద్వారా కూడా నిర్వచించవచ్చని వారు అన్నారు.

పాలో ఆల్టో నెట్‌వర్క్స్ సీఈఓ శ్రీ నికేశ్ అరోరా మాట్లాడుతూ, ఆధునిక చరిత్రలో అత్యంత వేగంగా చోటుచేసుకున్న సాంకేతిక పరివర్తన ఏఐ అని నిర్వచించారు. ప్రస్తుతం నవకల్పనల జోరు సంస్థలు చేస్తున్న సన్నాహాల కన్నా అధికంగా ఉందన్నారు. “ ఏఐ సమాప్తం కాబోదు. దీని ఉనికిని రూపు మాపలేం” అని ఆయన అన్నారు. “మనం సామర్థ్యాల్ని ఎంత వేగంగా తీర్చిదిద్దుతున్నామో, అంతే వేగంగా నమ్మకాన్ని సాధించగలుగుతామా అన్నదే సిసలైన ప్రశ్న” అని ఆయన అన్నారు. స్వతంత్ర ప్రతిపత్తిని కలిగివుండే, ఏజెంటిక్ వ్యవస్థలు వృద్ధి చెందుతుండటాన్ని గురించి ఆయన చెబుతూ, “ఒకవేళ ఏఐ స్వతంత్రంగా పనిచేయగలిగిందంటే, మరి పాలన, జవాబుదారుతనం, భద్రతల మాటేమిటి? వాటిని తరువాతి దశలో ఆలోచించలేం. వాటిని మొదటి నుంచే మూల ఆధారాలుగా మలచక తప్పదు” అని ఆయన అన్నారు.

హెచ్‌సీఎల్ టెక్ చైర్‌పర్సన్ రోష్నీ నాడార్ మాట్లాడుతూ, భారత్‌కే కాక ప్రపంచానికి కూడా ఒక నిర్మాణాత్మక ఆర్థిక మలుపుగా కృత్రిమ మేధ నిలిచిందని వర్ణించారు. జ్ఞానం తనంత తానే ప్రోగ్రామ్ చేయగలిగిందిగా మార్పు చెందుతోందన్న వాదనను ఆమె వినిపిస్తూ, “ఏఐ యుగంలో, విస్తృతి వల్లనే పైచేయిని సాధించడానికి కుదరదు. అది ప్లాట్‌ఫారాలు, మేధాసంపత్తి, నవకల్పనల యాజమాన్యంతోనే వీలుపడుతుంది” అన్నారు.

వ్యూహాత్మక మార్పును గురించి ఆమె ప్రస్తావిస్తూ, “భారత్ సేవల శక్తి కేంద్రంగా మారే క్రమం నుంచి మేధాసంపత్తి (ఐపీ)కి శక్తికేంద్రంగా తప్పక మారాలి. సేవలు ప్రయత్నాలతో విస్తరించగలుగుతాయి; అదే మేధాసంపత్తి విషయానికి వస్తే, ఎలాంటి పరిమితులూ లేకుండా వృద్ధి చెందుతుంది” అని ఆమె అన్నారు.

ఎన్ఎక్స్‌పీ సెమీకండక్టర్స్ సీటీఓ శ్రీ లార్స్ రేగర్ ప్రసంగిస్తూ హార్డవేర్, ఎడ్జ్–కంప్యూటింగ్ దృష్టికోణాన్ని ప్రస్తావించారు. ఉపకరణాల్లోనూ, భౌతిక వ్యవస్థల్లోనూ నేరుగా ఇంటెలిజెన్సును చేర్చడానికి (ఎంబెడింగ్) ప్రాధాన్యాన్ని ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. “ఏఐ భవిష్యత్తు కేవలం పెద్ద డేటా సెంటర్లకే పరిమితం కాబోదు. అది క్రమంగా ముందుకు సాగిపోతుంటుంది.. వాహనాల లోపలా, కర్మాగారాల్లో, వైద్య చికిత్స పరికరాల్లో, ఇంకా మౌలిక సదుపాయాల లోపలికీ నెట్టుకుని పోతుంది” అని ఆయన అన్నారు. భద్రతకీ, సైబర్ సెక్యూరిటీకీ పెద్దపీట వేయాల్సిన అవసరం ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ఒకవేళ పరికరం స్థాయిలో భరోసా ఏర్పడలేదంటే, అప్పుడు ఏఐని స్వీకరించే ప్రక్రియే ఆగిపోతుంది. విధులను నిర్వర్తించడంలో సురక్ష, భద్రత ఐచ్ఛిక లక్షణాలేం కావు, అవి తప్పక ఉండవలసినవి” అని ఆయన స్పష్టం చేశారు.

సర్వీస్‌నౌ ప్రెసిడెంటు, సీపీఓ, సీఓఓ శ్రీ అమిత్ జవేరీ ఎంటర్‌ప్రైజ్‌లను దృష్టిలో పెట్టుకొని మాట్లాడుతూ, కృత్రిమ మేధని పెద్ద ఎత్తున ఉపయోగంలోకి తీసుకురావడం ముఖ్యమన్నారు. ప్రయోగ దశకీ, వాస్తవ ప్రపంచంలో సేవల వినియోగానికీ మధ్య ఉంటున్న అంతరాన్ని గురించి ఆయన ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, “అనేక సంస్థలు కృత్రిమ మేధ తాలూకు ప్రయోగాత్మక ప్రాజెక్టుల్ని నిర్వహిస్తున్నాయి.. అయితే దీనిని భారీ స్థాయిలో అమల్లోకి తీసుకురావడానికి ప్లాట్‌ఫారంలోనే పాలన, విజిబులిటీ, నియంత్రణ.. వీటిని అంతర్భాగాలుగా చేయవలసి ఉంటుంది” అన్నారు. అదనపు సదుపాయాల పద్ధతికి బదులు ఏకీకరణ వైపు మొగ్గు చూపాలని ఆయన చెప్పారు. “భద్రత.. ఏఐకి భిన్నంగా ఏమీ ఉండజాలదు. దీనిని డిజైన్ మొదలు రంగంలో మోహరించడం వరకూ.. ఏఐ వ్యవస్థకు లోపలే అంతర్గతంగా ఇమిడ్చి తీరాలి” అని ఆయన అన్నారు.

నలుగురు ప్రముఖులూ కలిసి ఒక అంశాన్ని కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు. అది ఏమిటంటే.. ఏఐ తదుపరి దశ ఒక్క మోడళ్ల ఆధునికీకరణ సామర్థ్యంతో కాక, ఆయా వ్యవస్థల లోపల సురక్షిత, సమర్థ, బాధ్యతాయుతంగా పనుల్ని పూర్తి చేసే వాటి సామర్థ్యంతో నిర్ణయమవుతుందనేదే. ఇదే ఆర్థిక వ్యవస్థకీ, సమాజానికీ శక్తిని ప్రసాదిస్తుంది. సైబర్‌సెక్యూరిటీ, మేధాసంపత్తి మొదలు ఎడ్జ్ ఇంటెలిజెన్స్, ఎంటర్‌ప్రైజ్ గవర్నెన్స్ వరకూ చూస్తే కీలకోపన్యాసాల్లో ఒక విషయాన్ని వక్తలు బలంగా చాటిచెప్పారు. అది.. విశ్వాసమే పునాదిగా ఏఐ భవిష్యత్తు రూపొందుతుందని, అలా అయినప్పుడు నవకల్పనలు సంస్థలను బలోపేతం చేయగలుగుతాయని, వినియోగదారుల ప్రయోజనాల్ని కాపాడగలుగుతాయని, ఆటుపోటులకు తట్టుకొని నిలవగల వాస్తవిక ప్రపంచంతో పోలివుండే ప్రభావాన్ని అందించగలుగుతాయని“ వారు అన్నారు.

వికసిత భారత్-2047 సాకారంలో ఏఐ ఒక వినూత్న శక్తి: ముకేష్ అంబానీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: న్యూఢిల్లీలో నిర్వహిస్తున్న “ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్–2026”లో భాగంగా పలువురు పారిశ్రామిక దిగ్గజాలు ఇవాళ నాలుగు కీలక ఉపన్యాస కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ మేరకు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ చైర్మన్–మేనేజింగ్ డైరెక్టర్ ముఖేష్ ధీరూభాయ్ అంబానీ, డీప్‌మైండ్ టెక్నాలజీస్ సీఈవో డెమిస్ హస్సాబిస్, వియనై సిస్టమ్స్ ఇంక్ సీఈవో విశాల్ సిక్కా, విప్రో ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రిషద్ ప్రేమ్‌జీ వీటిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాధ్యతాయుత, సమ్మిళిత, భారీ విస్తరణ ద్వారా భారత్‌ను ప్రపంచ ఏఐ రూపాంతరీకరణలో ముందంజలో నిలపడంపై వారు తమతమ దృక్కోణాలను వివరించారు.

ముందుగా ముఖేష్ ధీరూభాయ్ అంబానీ మాట్లాడుతూ– ఈ సదస్సును దేశాన్ని మలుపు తిప్పే ఘట్టంగా అభివర్ణించారు, ఈ మేరకు “అంతర్జాతీయ ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ భారత సాంకేతిక చరిత్రలో ఒక నిర్ణయాత్మక ఘట్టం. వికసిత భారత్ స్వప్న సాకారంలో ‘ఏఐ’ని ఒక చోదక శక్తిగా మారుస్తామని ప్రతిన బూనిన క్షణమిది. స్వాతంత్ర్య అద్భుత శతాబ్ది వేడుకలు నిర్వహించుకునే 2047 నాటికి పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందిన దేశంగా మారాలన్నది మన దార్శనికత” అన్నారు. అలాగే, అధికార కేంద్రీకరణకన్నా ప్రజాస్వామ్యీకరణ ప్రాధాన్యాన్ని వివరిస్తూ– “అయితే, ఇందుకు మరో మార్గం కూడా ఉంది: అదేమిటంటే– అందరికీ ప్రయోజనకరంగా అందుబాటులో, సరసమైన ధరకు లభించే భవిష్యత్ కృత్రిమ మేధ. భారత్ ఇప్పుడు ఈ రెండో భవిష్యత్తుపై విశ్వాసం పెంచుకుంది” అన్నారు.

మరోవైపు భారత్ ప్రగతి వేగం పెంచడంలో కీలకమైన సావరిన్ కంప్యూట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, గ్రీన్–పవర్డ్ డేటా సెంటర్లు, ఎడ్జ్ ఇంటెలిజెన్స్‌లో భారీ ఎత్తున పెట్టుబడులు పెడతామని ఆయన ప్రకటించారు.

డీప్‌మైండ్ టెక్నాలజీస్ సీఈవో డెమిస్ హస్సాబిస్ మాట్లాడుతూ, ఏఐ నుంచి లభించే శాస్త్రీయ భరోసా, ఇప్పుడు ప్రపంచం ముందున్న పరిమితులను ప్రస్తావించారు. ఈ మేరకు “ప్రస్తుతం మనం 2026 ఉన్నాం.. రాబోయే ఐదేళ్లలో ఏజీఐ శకంలోకి ప్రవేశించబోతున్నాం” అని పేర్కొన్నారు. రాబోయే మార్పుల స్థాయిని వివరిస్తూ– “ఏఐ విప్లవ ప్రభావం మునుపటి పారిశ్రామిక విప్లవంకన్నా 10 రెట్లు ఎక్కువగా ఉంటుందని నా అభిప్రాయం.. అంటే– ఇది 10 రెట్ల వేగంతో దూసుకొస్తుందని భావిస్తున్నాను” అని చెప్పారు. మానవాళికి ఏఐ ద్వారా భారీ ప్రయోజనం లభించేలా శాస్త్రీయ కాఠిన్యం, అంతర్జాతీయ సహకారం, సమగ్ర చర్చల అవసరాన్ని ఆయన స్పష్టం చేశారు.

వియానై సిస్టమ్స్ ఇంక్ సీఈవో విశాల్ సిక్కా ప్రసంగిస్తూ– ఏఐ ద్వారా ఇప్పటికే ఒనగూడుతున్న అసాధారణ ఉత్పాదకత ప్రయోజనాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. అయితే, ఈ క్రమంలో ఉదాసీనతకు తావుండరాదని హెచ్చరించారు. ‘‘కృత్రిమ మేధను ఎలా ఉపయోగించాలో అర్థం చేసుకున్న వ్యక్తులు దానితో ఆశ్చర్యకర రీతిలో ప్రభావవంతంగా పనిచేస్తారు” అని ఆయన అన్నారు. అదే సమయంలో భద్రత, విశ్వసనీయత, ఇంధన సమస్యల పరిష్కారం ఆవశ్యకతను స్పష్టం చేశారు. భారత్ కృత్రిమ మేధను అనుసరించడమే కాకుండా ఇందులో భవిష్యత్ సాంకేతికను రూపొందించాలని కోరారు. “నేటి ‘ఏఐ’లో నైపుణ్య సాధనతోపాటు మనం దాన్ని వేగంగా అధిగమిస్తూ మరింత ఉన్నత స్థాయిని అందుకోవాలి” అన్నారు.

విప్రో ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రిషద్ ప్రేమ్‌జీ మాట్లాడుతూ– ఆచరణాత్మక అనువర్తనం, పారిశ్రామిక స్థాయి రూపాంతరీకరణలపైన దృష్టి సారించాలన్నారు. “ఒక తరంలో ఒకసారి, మనం చేయగలిగినదాన్ని మార్చలేని సాంకేతికత ఒకటి ఉద్భవిస్తూంటుంది. అయితే, అది మనం చేయాల్సినదేమిటో దిశానిర్దేశం చేస్తూ మార్పు తెస్తుంది. అదే ఈ నిర్దిష్ట కృత్రిమ మేధ సాంకేతికత’’ అన్నారు. వాస్తవ ప్రపంచ వినియోగం నుంచే విలువ లభ్యమవుతుందని స్పష్టం చేశారు. “వాస్తవ ప్రపంచ సమస్యలను బాధ్యతాయుతంగా, విశేష స్థాయిలో పరిష్కరించేందుకు ఉపయోగపడితేనే సాంకేతికత ఒక విలువను సృష్టించగలదు’’ అన్నారు. ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, ప్రజా సేవల ప్రదానాన్ని ఈ సందర్భంగా ఉదాహరిస్తూ– భారత్‌ను అనువర్తిత ఏఐ ఆవిష్కరణలకు అనువైన వాతావరణం కలదిగా ఆయన పేర్కొన్నారు.

ఈ నాలుగు కీలకోపన్యాస కార్యక్రమాలు సదస్సు కీలక సందేశాన్ని బలోపేతం చేశాయి: భారత ఏఐ ప్రస్థానం బాధ్యతతో, భారీ స్థాయితో కొనసాగిస్తూ సమ్మిళితత్వాన్ని, సాంకేతిక నాయకత్వాన్ని ప్రపంచ సహకారంతో మేళవించాలి. ఆ మేరకు మేధస్సు కేంద్రీకృతమై పోకుండా జాతీయ ప్రగతి, ప్రపంచ ఉమ్మడి పురోగమనం దిశగా విస్తృతమయ్యేలా చూసుకోవాలి.

ట్రాన్స్‌ఫార్మర్స్ కాపర్ వైర్ల దొంగలు ముగ్గురు అరెస్ట్

ఖమ్మం, ఫిబ్రవరి 21: ఖమ్మం జిల్లా కామేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ట్రాన్స్ ఫార్మర్ కాపర్ వైర్ దొంగతనాల కేసును పోలీసులు ఛేదించారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి కాపర్ వైర్‌ను స్వాధీనం చేసుకున్నారు. సింగరేణి సీఐ ఎన్.సాగర్ కేసు వివరాలను వెల్లడించారు. ఈ నెల 20న కామేపల్లి క్రాస్ రోడ్ వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో అనుమానాస్పదంగా వెళ్తున్న స్కూటీని ఆపి పోలీసులు ప్రశ్నించారు.

విచారణలో నిందితులు కామేపల్లి మండలం తో పాటు ఖమ్మం జిల్లా వరిధి లోని కారేపల్లి, ఖమ్మం 3 టౌన్, అర్బన్, రూరల్, నేలకొండపల్లి, కొణిజర్ల పోలీస్ స్టేషన్ పరిధుల్లో దొంగతనాలకు పాల్పడినట్లు నిర్ధారణ అయ్యింది.

నిందితులు మొత్తం 13 దొంగతనం కేసుల్లో సుమారు 19 ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని కాపర్ వైర్‌ను అపహరించినట్లు సీఐ తెలి పారు. దేవల్ల శ్రీకాంత్, పాండురంగాపురం, ఖమ్మం అర్బన్ మండలం. పాత ఇనుప కొట్టు యజమానులు పేంద్ర సురే ష్, బుర్హాన్‌పురం, ఖమ్మం. సిం గజోగి యాదగిరి, మామిళ్ల గూడెం, ఖమ్మంను అరెస్టు చేసినట్లు వెల్లడించారు.

వీరి వద్ద నుండి సుమారు 100 కిలోల కాపర్ వైర్, స్కూటీ (ఉ 04 2014)ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు గుర్తించామని, వారిలో ఒకరు ఖమ్మం, ఇద్దరు హైదరాబాద్‌లో ఉన్నారని వారిని కూడా త్వరలో అరెస్ట్ చేస్తామని తెలిపారు. అరెస్టు చేసిన వారిపై 303 (2), 112, 317(2) ఃఔ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి రిమాండ్ కి తరలించినట్లు చెప్పారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ చూపిన కామేపల్లి ఎస్ఐ శ్రీకాంత్, పోలీస్ స్టేషన్ సిబ్బందిని, సహకారం అందించిన కారేపల్లి ఎస్ఐ బైరు గోపి, స్టేషన్ సిబ్బందిని పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.

స్వచ్ఛ రథం ప్రారంభం

అమరావతి, ఫిబ్రవరి 21: వల్లాడు జిల్లా వినుకొండలో స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఘన వ్యర్థాల సేకరణ కోసం నిర్దేశించిన స్వచ్ఛ రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇంటింటా చెత్త సేకరణ కోసం ఉద్దేశించిన పుష్ కార్ట్ లు, ఈ ఆటోస్ ను ప్రారంభించి వ్యర్థాల సేకరణ కోసం అనుసరించాల్సిన విధానాలను సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

వెలిమినేడు పీఏసీఎస్ కార్యాలయానికి తాళం వేసిన రైతులు

నల్గొండ, ఫిబ్రవరి 21: నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు పీఏసీఎస్ కార్యాలయం ఎదుట రైతులు శనివారం ఆందోళన చేపట్టారు. పీఎసీఎస్ లో 560 బస్తాల యూరియాను ఆన్ లైన్ లో అందుబాటులో ఉంచిన ఐదు నిమిషాలకే నో స్టాక్ గా చూపించడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం యూరియా స్టాక్ ఆన్ లైన్ నమోదు చేసిన కొద్ది నిమిషాల్లోనే పూర్తిగా అయిపొయిందని సిస్టంలో చూపించారు. అయితే సమీప ప్రాంత రైతులకు కాకుండా ముందుగానే బుక్ చేసుకున్న కొందరికి మాత్రమే యూరియా అందిస్తున్నారని ఆరోపిస్తూ సంఘం కార్యాలయానికి తాళం వేసి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. పీఏసీఎస్ సిబ్బంది ముందుగానే తెలిసిన వారిచే యాప్ లో యూరియా బుకింగ్ చేయించుకుని బ్లాక్ లో అమ్ముకుంటున్నారని ఆరోపించారు.

ఆన్‌లైన్‌లో ఉంచిన ఐదు నిమిషాలకే ఎలా అయిపోతుందని, సరైన సమయంలో యూరియా వేయకపోవడంతో పంటలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అ

భాషా వైవిధ్యం చాలా అవసరం.. మైక్రోసాఫ్ట్ వైస్ చైర్మన్, ప్రెసిడెంట్ బ్రాడ్ స్మిత్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు-2026లో భాగంగా ఓపెన్ఏఐ సీఈవో సామ్ ఆల్ట్మన్, మైక్రోసాఫ్ట్ వైస్ చైర్మన్, ప్రెసిడెంట్ బ్రాడ్ స్మిత్, గేట్స్ ఫౌండేషన్ ఆఫ్రికా-ఇండియా కార్యాలయాల అధ్యక్షులు అంకుర్ వోరా... యాక్సెంచర్ చైర్‌పర్సన్, సీఈవో జూలీ స్వీట్ ముఖ్యోపన్యాసాలు చేస్తూ... ప్రజాస్వామీకరణ, సమ్మిళితత్వం, ప్రపంచ స్థాయి ప్రమాణాలు, మానవ నేతృత్వంలోని పునఃసృష్టిని ప్రస్తావిస్తూ కృత్రిమ మేధ పరివర్తన సామర్థ్యాన్ని స్పష్టం చేశారు. ఇండియా ఏఐ సదస్సును ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యంగా గ్లోబల్ సౌత్ సాధికారత కోసం ఏఐ సదస్సు ఒక సాధనంగా మారాలని అన్నారు.

ఓపెన్ఏఐ సీఈవో సామ్ ఆల్ట్మన్ తన ప్రసంగంలో సాంకేతిక పురోగతి అసాధారణ వేగం, దాని పథాన్ని రూపొందించడంలో పెరుగుతున్న భారత్ పాత్ర రెండింటినీ హైలైట్ చేస్తూ... "మన ప్రస్తుత పథంలో నిజమైన సూపర్ ఇంటెలిజెన్స్ ప్రారంభ వెర్షన్లకు మనం కేవలం రెండు సంవత్సరాల దూరంలో ఉండవచ్చని మేం నమ్ముతున్నాం. మనం సరిగ్గా ఆలోచిస్తే, 2028 చివరి నాటికి ప్రపంచంలోని మేధో సామర్థ్యంలో ఎక్కువ భాగం డేటా సెంటర్ల వెలుపల కంటే లోపలే ఉంటుంది.'' అన్నారు. సంసిద్ధత, సామాజిక సామర్థ్యాల ప్రాముఖ్యాన్ని ప్రధానంగా ప్రస్తావిస్తూ... "ఏఐ ప్రజాస్వామీకరణ మాత్రమే మనం ముందుకు సాగడానికి న్యాయమైన, సురక్షితమైన మార్గం. ఏఐ ప్రజాస్వామీకరణ మానవత్వం పరిమళించేందుకు ఉత్తమ మార్గం" అని అన్నారు.

ప్రపంచ సాంకేతిక అంతరాన్ని పరిష్కరించడంలో ఏఐ నిర్ణయాత్మక శక్తిగా మైక్రోసాఫ్ట్ వైస్ చైర్మన్, ప్రెసిడెంట్ బ్రాడ్ స్మిత్ అభివర్ణించారు, "ఈ శతాబ్దంలో ఆర్థిక అంతరాన్ని తగ్గించడం లేదా దానిని మరింత తీవ్రం చేయడంలో ఏఐ నిర్ణయాత్మక పాత్ర పోషిస్తుంది. నేడు మనకు ఉన్న ఏకైక ముఖ్యమైన ప్రశ్న... మనం ఎలా రాణించగలం?" ఏఐ... గ్లోబల్ సౌత్‌కు సేవ చేస్తుందని, విస్తృత శ్రేయస్సును అందిస్తుందని నిర్ధారించడానికి మౌలిక సదుపాయాలు, వైవిధ్యం, భాషా వైవిధ్యం అవసరమని ఆయన స్పష్టం చేశారు.

గేట్స్ ఫౌండేషన్ ఆఫ్రికా-ఇండియా కార్యాలయాల అధ్యక్షులు అంకుర్ వోరా మాట్లాడుతూ... ఆరోగ్యం, విద్య, వ్యవసాయ రంగ ఫలితాలను వేగవంతం చేయడంలో ఏఐ సామర్థ్యంపై దృష్టి సారించి, "చాలా మంది ఏఐ ప్రపంచం అందరికీ మెరుగ్గా ఉండటానికి సహాయపడుతుందని అంచనా వేస్తున్నారు. మరికొందరు ఇది విశేషమైన కొద్దిమందికి మాత్రమే ప్రయోజనం చేకూరుస్తుందని అంచనా వేస్తున్నారు. కానీ వాస్తవం ఏమిటంటే, ఇది అంచనాలకు సంబంధించిన విషయం కాదు. ఇది ఒక ఎంపిక." ఏఐ కొత్త దాతృత్వ కార్యక్రమాలను ప్రకటిస్తూ, చరిత్రాత్మకంగా వెనుకబడిన వర్గాల జీవితాలను స్పష్టంగా మెరుగుపరుస్తుందా లేదా అనేది దాని కొలమానం యాక్సెంచర్ చైర్‌పర్సన్, సీఈవో జూలీ స్వీట్ మాట్లాడుతూ... "ప్రపంచవ్యాప్తంగా శ్రేయస్సు సాధించడానికి ఏఐని వృద్ధికి ఇంజిన్‌గా ఉపయోగించడం ఏకైక మార్గం" అని స్పష్టం చేశారు. కంపెనీలు, ప్రభుత్వాలు, వ్యక్తుల పునరావిష్కరణ కోసం ఆమె పిలుపునిచ్చారు. స్థిరమైన పురోగతికి నాయకత్వం, ప్రపంచ ప్రమాణాలు, శ్రామిక శక్తి పరివర్తన, మానవుల నియంత్రణలో ఏఐ వృద్ధిని నడిపించే నిబద్ధతలు అవసరమని ఆమె తెలిపారు.

సమష్టిగా నాలుగు ముఖ్య ప్రసంగాలూ అపూర్వమైన సాంకేతిక వేగం... బాధ్యత, సమ్మిళితత్వం, ప్రపంచ సహకారాల కోసం తక్షణ అవసరంగా ఏఐని వివరించాయి. సూపర్ ఇంటెలిజెన్స్, ప్రాంతీయ సామర్థ్యం నుంచి మౌలిక సదుపాయాలు, నైపుణ్యం, సామాజిక ప్రభావాల వరకు... ఏఐ విభజనలను తీవ్రతరం చేయకుండా అనుసంధానం ద్వారా వాటిని మరింత చేరువ చేయాలి, అధికార కేంద్రీకరణ చేయకుండా అవకాశాలను విస్తరించాలి, అంతిమంగా మానవ విలువలు, ప్రజాస్వామ్య సంస్థలు, ప్రజా ప్రయోజనకరమైన నాయకత్వం ద్వారా ఏఐని రూపొందించాలనే ఉమ్మడి ఎజెండా గురించి పరిశ్రమ దిగ్గజాలు చర్చించారు.

ఫోటోల ప్రదర్శనపై నిరసన..

కర్నూలు ఫిబ్రవరి 21: అసెంబ్లీలో వైసీపీ నాయకులు కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి ఫోటోలను ప్రదర్శిస్తూ అపవిత్రం చేశారనే ఆరోపణల నేపథ్యంలో శనివారం ఉదయం కర్నూలు నగరంలోని సంకల్ బాగ్‌లో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుదీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీ.జి. భరత్ పాల్గొన్నారు.

కర్నూలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, రాష్ట్ర బొందిలి కార్పొరేషన్ చైర్మన్ విక్రం సింఘ్, హజ్ కమిటీ సభ్యుడు మన్సూర్ అలి ఖాన్, పార్లమెంట్ పార్టీ ఉపాధ్యక్షుడు సోమిశెట్టి శ్రీకాంత్, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు సోమిశెట్టి నవీన్, రాష్ట్ర తెలుగుయువత అధికార ప్రతినిధి జూటూరు రవి కుమార్, కర్నూలు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మారుతి శర్మ, పి. హనుమంతరావు చౌదరి, గట్టు తిలక్, పాల్ రాజ్, రవి చంద్ర శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శుదీకరణ కార్యక్రమం చేపట్టారు. దేవాలయ ప్రాంగణంలో భక్తులు, పార్టీ నాయకులు పెద్ద ఎత్తున హాజరై భక్తి గీతాలు ఆలపించారు. అనంతరం నేతలు మాట్లాడుతూ అసెంబ్లీలో జరిగిన ఘటనను ఖండిస్తూ దేవతా చిత్రాల పట్ల గౌరవభావం పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'మానవ కేంద్రిత ఏఐ' భవిష్యత్తును విశ్లేషించిన అడ్వాన్స్‌డ్ మెషీన్ ఇంటెలిజెన్స్ ల్యాబ్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ లెకున్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో భాగంగా పరిశ్రమలు, పరిపాలన, ఆరోగ్యం, సమాచార ప్రామాణికత, అంతర్జాతీయ ప్రమాణాలపై ఏఐ చూపే పరివర్తనాత్మక ప్రభావం గురించి పలువురు సాంకేతిక దిగ్గజాలు, పారిశ్రామిక నాయకులు విస్తృతంగా చర్చించారు. ఢిల్లీలోని భారత్ మండపంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేడు ఏఐ ఇంపాక్ట్ సదస్సును ప్రారంభించారు.

ఇండియా ఏఐ సదస్సులో భాగంగా భారతీ ఎయిర్‌టెల్ వ్యవస్థాపక చైర్మన్ సునీల్ భారతి మిట్టల్, అడోబ్ చైర్మన్ - సీఈఓ శంతను నారాయణ్ మధ్య ఆసక్తికరమైన చర్చ జరిగింది. టెలికమ్యూనికేషన్స్, వ్యక్తిగతీకరించిన వైద్యం, విద్య, డిజిటల్ మౌలిక సదుపాయాల వంటి వివిధ రంగాలలో విస్తరిస్తున్న ఏఐ పాత్రపై ఈ చర్చ ప్రధానంగా దృష్టి సారించింది. సంస్థల నిర్వహణలో ఏ విధంగా ఏఐ కీలక పాత్ర పోషిస్తుందన్న విషయం గురించి సునీల్ భారతి మిట్టల్ మాట్లాడుతూ.. "మా కంపెనీ పరంగా చూస్తే మేం కార్యకలాపాలను నిర్వహించే విధానం, కస్టమర్లకు సేవలు అందించడం, నెట్‌వర్క్‌లను నిర్మించడం, వాటిని నిర్వహించడంలో ఏఐ ఇప్పుడు ఒక విడదీయరాని భాగం అయిపోయింది'' అని అన్నారు.

సమాచారాన్ని అందరికీ చేరువ చేయడంలో ఏఐకి ఉన్న శక్తిని శంతను నారాయణ్ ప్రముఖంగా చెప్పారు. సమాచార గోప్యత విషయంలో ప్రపంచ ప్రమాణాలను రూపొందించడంలో భారతదేశానికి ఉన్న అసాధారణ అవకాశాన్ని ఆయన ప్రస్తావిస్తూ.. ''కేవలం ఈ ఏఐ మోడల్స్ వల్ల కలిగే ప్రయోజనాల విషయంలోనే కాకుండా డేటా, గోప్యత, భద్రత, నమ్మకం వంటి అంశాలపై ప్రపంచం ఆలోచించే తీరును నిర్దేశించడంలో భారత్ నాయకత్వ పాత్ర పోషించగలదు" అని వ్యాఖ్యానించారు.

ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు- చైర్మన్ నందన్ నిలేకని, ఆంత్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ మధ్య ఒక విస్తృతమైన చర్చ జరిగింది. కృత్రిమ మేధ వేగంగా వృద్ధి చెందుతుండటం, ఒక దేశ జనాభా అంతటికి ఏఐని చేరవేయడంలో ఎదురయ్యే సవాళ్లు.. ఆవిష్కరణలు- ప్రజాస్వామ్య పద్ధతిలో రక్షణ కవచాలకు మధ్య సమతుల్యతను పాటిస్తూ సమ్మిళిత వృద్ధిని సాధించడంపై వీరు చర్చించారు.

సాంకేతిక పురోగతి, సామాజిక ప్రభావానికి మధ్య ఉన్న వ్యత్యాసం గురించి డారియో అమోడెయ్ మాట్లాడుతూ.. "సాంకేతికతకు ఉన్న ప్రాథమిక సామర్థ్యాలు, ఆ సామర్థ్యాలు ప్రపంచవ్యాప్తంగా విస్తరించడానికి పట్టే సమయానికి మధ్య ఒక ద్వంద్వ స్వభావం ఉంటుంది. గ్లోబల్ సౌత్‌లో ఏఐ వల్ల కలిగే ప్రయోజనాలు ప్రపంచంలోని మరే ఇతర ప్రాంతం కంటే ఎక్కువగా ఉండొచ్చు. మనం ఏఐ భద్రత, ప్రజాస్వామ్య పద్ధతిలో నియంత్రిచటం, ఆర్థిక సమ్మిళితత్వం వంటి అంశాలను సరిగ్గా అమలు చేయటాన్ని ఇది మరింత ముఖ్యమైన అంశంగా చేస్తోంది" అని పేర్కొన్నారు.

ఈ సంభాషణలో గ్లోబల్ సౌత్ దేశాలకు ఏఐ వల్ల కలిగే ప్రమాదాలు, అవకాశాల గురించి కూడా చర్చించారు. ఇందులో ప్రధానంగా ఆర్థిక మార్పు లేదా ఉపాధి కోల్పోయే ముప్పు, భద్రత, ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా ఉండాలంటే ఏఐ వల్ల కలిగే నిజమైన ప్రయోజనాలను నిరూపించాల్సిన అవసరం గురించి చర్చించారు.

అడ్వాన్స్‌డ్ మెషీన్ ఇంటెలిజెన్స్ ల్యాబ్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ యాన్ లెకున్‌తో ఒక విస్తృత స్థాయి చర్చ జరిగింది. ఇండియా టుడే మేనేజింగ్ ఎడిటర్ శ్రీమతి మేరియా షకీల్ తో జరిగిన ఈ సంభాషణలో కృత్రిమ మేధ పరిణామం, సహజ మేధస్సు- ఏఐ వ్యవస్థల మధ్య ఉన్న వ్యత్యాసం, సాంకేతిక పురోగతి సుదీర్ఘ గమనం గురించి లెకున్ అభిప్రాయాలను పంచుకున్నారు.

'ఏఐ మానవ మేధస్సును మించిపోయే దిశగా పయనిస్తోందా?' అనే ప్రశ్నతో ఈ సంభాషణ ప్రారంభమైంది. ఈ చర్చను లెకున్ ఒక కొత్త కోణంలోకి తీసుకెళ్లారు. ఏఐ అనేది మానవ మేధస్సును భర్తీ చేయడం కంటే దానిని అనేక రెట్లు పెంచే సామర్థ్యాన్ని కలిగి ఉండటమే ప్రస్తుతానికి అత్యంత కీలకమైన, అర్థవంతమైన మార్పు అని ఆయన అభిప్రాయపడ్డారు.

ప్రపంచ ఏఐ ఆవిష్కరణలలో భారత్ పాత్రను లెకున్ ప్రస్తావిస్తూ? "దీర్ఘకాలికంగా చూస్తే అనుకూలమైన జనాభా పరిస్థితులు ఉన్న భారత్, ఆఫ్రికా వంటి దేశాల నుంచే కొత్త ఆవిష్కరణలు వస్తాయి. మానవాళిలో యువతే అత్యంత సృజనాత్మకమైన భాగం" అని వ్యాఖ్యానించారు. ఏఐ యుగంలో విద్య మరింత కీలకమైన అంశంగా మారుతుందని ఆయన ఉద్ఘాటించారు. ఏఐకి ఉన్న పరివర్తనాత్మక సామర్థ్యాన్ని ఆయన వివరిస్తూ.. "కొందరు ఆర్థికవేత్తలు దీనిని 'కొత్త విద్యుత్' అని పిలుస్తారు. కానీ నేను దీనిని 'కొత్త ప్రింటింగ్ ప్రెస్'గా భావిస్తాను. ఇది విజ్ఞానాన్ని వ్యాప్తి చేయడం, మానవ మేధస్సును పెంపొందించడం గురించి చెబుతుంది" అని అన్నారు.

భారీ జనాభా, అనుకూలమైన జనాభా పరిస్థితులు, మార్పును తీసుకురాగల అపారమైన సామర్థ్యం ఉన్న భారత్.. అంతర్జాతీయ ప్రమాణాలను నిర్దేశించడం, సమ్మిళిత- మానవ కేంద్రిత ఏఐ ఆవిష్కరణలను నడిపించడంలో ఒక విశిష్టమైన స్థానంలో ఉన్నట్లు పారిశ్రామిక దిగ్గజాలు పేర్కొన్నారు.

రేషన్ బియ్యం నాణ్యతలో రాజీ పడొద్దు

-పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

హైదరాబాద్ ఫిబ్రవరి 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్):: పేద

ప్రజలు కూడా సంపన్నులతో సమానంగా నన్నబియ్యంతో భోజనం చేయాలన్న మహత్తర సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం సరఫరా చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి మరియు ఎక్స్-అఫిషియో కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర, తెలిపారు. బియ్యం నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడకూడదని ఆయన అధికారులను కఠినంగా ఆదేశించారు. హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లిలో ఉన్న సివిల్ సప్లైస్ గోదామును కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. దాదాపు రెండు గంటలపాటు గోదాములో నిల్వ ఉన్న బియ్యం సంచులను యాదృచ్ఛికంగా తెరిపించి నాణ్యతను స్వయంగా పరిశీలించారు. బియ్యం లో నూకల శాతం, తేమ శాతం వంటి అంశాలపై అధికారులను ప్రశ్నించి పూర్తి వివరాలు తెలుసుకు న్నారు. గోదాముకు వచ్చిన బియ్యాన్ని స్వీకరించే దశలోనే క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిల్వలను తిరస్కరించాలని గోదాం ఇన్‌చార్జీలకు సూచించారు. ఈ విషయంలో ఏం మాత్రం రాచి పడిన కఠినంగా వ్యవహరిస్తానని హెచ్చరించారు. ప్రజలకు చేరే ప్రతి బియ్యం గింజ నాణ్యమైనదిగా ఉండేలా బాధ్యతగా వ్యవహరిం చాలన్నారు. సరఫరా వ్యవస్థలో పారదర్శకత కోసం స్టాక్ రిజిస్టర్లు, ఇన్‌వర్-అవుట్‌వర్డ్ వివరాలు, రవాణా రికార్డులను కమిషనర్ పరిశీలించారు. రేషన్ షాపులకు బియ్యం సరఫరాలో ఎలాంటి ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించా రు. గోదాములో పని చేస్తున్న హమాలీలతో మాట్లాడిన కమిషనర్ గారు వారి పనివాతావరణం, సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. "ప్రజల విశ్వాసమే మా బలం. ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే నాణ్యతే ప్రమాణం కావాలి. రేషన్ బియ్యం విషయంలో చిన్న తప్పిదం కూడా సహించము,'' అని కమిషనర్ గారు స్పష్టం చేశారు. ఈ తనిఖీలో హైదరాబాద్ జిల్లా మేనేజర్ కె. సాయి అరుణ్, అదనపు జిల్లా మేనేజర్ దీప్తి, గోదాం ఇన్‌చార్జీలు గోపాలకృష్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా వేయి స్తంభాల గుడికి వచ్చిన ఆదాయం ఎంతంటే ..

హన్మకొండ, ఫిబ్రవరి 21: చారిత్రక రుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయంలో ఈనెల 14 నుంచి 18 వరకు జరిగిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన 9 హుండీ ల లెక్కింపు శనివారం నిర్వహించారు.

ఆలయ నాట్య మండపంలో దేవాదాయ శాఖ పరిశీలకుడు ప్రసాద్, ఆలయ కార్య నిర్వాహణాధికారి డి.అనిల్‌కుమార్ పర్యవేక్షణలో వెంకటేశ్వర సేవా సమితి మహిళా సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేందర్‌శర్మ, ఆలయ సిబ్బంది మధుకర్, రామకృష్ణ, రజిత, హనుమకొండ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం రెండు లక్షల రూపాయల ఆదాయం పెరిగింది. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ.27,44,268 ఆదాయం వచ్చిందని ఆలయ అధికారులు వివరించారు.

తెలుగు భాష దినోత్సవ సందర్భంగా వీర బొమ్మ రమేష్‌కు ఘన సన్మానం

హైద్రాబాద్ ఫిబ్రవరి 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్)తెలుగు భాష దినోత్సవ సందర్భంగా ప్రముఖ సామాజిక వేత్త ఆదిలీల ఫౌండేషన్ తెలంగాణ రాష్ట్ర చెర్మెన్ వీంబొమ్మ రమేష్ ను ఘనంగా సన్మానించారు. రవీంద్ర భారతిలో జరిగిన మహోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మాజీ బిసి కమిషన్ చెర్మెన్ వకులా భరణం కృష్ణ మోహన్ రావు చేతుల మీదుగా సత్కరించడం జరిగింది .ఈ కార్యక్రమం లో ఆదిలీల ఫౌండేషన్ నేషనల్ చైర్మన్ ఆదినారాయణ పాల్గొనడం జరిగింది.

అసత్య ఆరోపణలు చేస్తున్నారు..

కర్నూలు ఫిబ్రవరి 21: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపే ప్రధాన ధ్యేయంగా పనిచేయాలని జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ పిలుపునిచ్చారు. కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల, నగర, పట్టణ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల సమావేశం నిర్వహించబడింది. సమావేశానికి గుడిసె ఆది కృష్ణమ్మ అధ్యక్షత వహించారు. కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, డీసీఎంఎస్ చైర్మన్ వై. నాగేశ్వరరావు యాదవ్, కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్ర, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పి. కప్పట్రాళ్ల బొజ్జమ్మ, రాష్ట్ర నాయకుడు చంద్రశేఖర్ రాజా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

జిల్లాలోని వివిధ మండలాల నుంచి పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నియోజకవర్గ శాసనసభ్యులు, ఇన్‌చార్జిల సహకారంతో గ్రామ, వార్డు, బూత్, క్లస్టర్ స్థాయిలో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేయాలని సూచించారు. ప్రతి నాయకుడు తన పరిధిలో పార్టీ నిర్ణయాలను ప్రజలకు వివరించి మమేకం కావాలని కోరారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పేటీఎం బ్యాచ్ ద్వారా కూటమి ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం కొనసాగిస్తున్నారని విమర్శించారు.

అధికారంలో ఉన్నప్పటికీ ప్రతిపక్షంలా వ్యవహరిస్తూ అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. ఆ ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు మండల స్థాయి నాయకులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయాలని పిలుపునిచ్చారు. ప్రతి నెల ఒకటో తేదీన పెన్షన్ల పంపిణీ, తల్లికి వందనం పథకం కింద విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నిధుల జమ, రైతు భరోసా ద్వారా రైతులకు ఆర్థిక తోడ్పాటు వంటి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించి పరిశ్రమల స్థాపనకు చర్యలు తీసుకుంటూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, పోలీసు ఉద్యోగాల నియామకాలు, ఇతర ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందని గుర్తు చేశారు. ఈ అంశాలన్నింటినీ ప్రజలకు సవివరంగా తెలియజేస్తూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని నాయకులు కోరారు.

సమావేశంలో అమర్నాథ్ గౌడ్, పి. దావోదర్, కెటి వెంకటేష్, కాశిం వలి, మహేష్ కుమార్, తిమ్మప్ప, బోయ తిరుపతయ్య, జి. మల్లికార్జున, సి. సురేష్ నాయుడు, పల్లెపాడు రామిరెడ్డి, కే. శ్రీనివాసులు, కే. పురుషోత్తం, కే. శివప్ప, ప్రసన్న లక్ష్మి, జి. కిష్టయ్య, గురుస్వామి, రాజేష్, నర్సింలు, వెంకటరమణ, రామాంజనేయులు, పట్టాభి, కే. రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏరియా వర్క్‌షాప్‌లో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ అవగాహన సదస్సు

ఖమ్మం, ఫిబ్రవరి 21:ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడాది లక్షలాది మంది క్యాన్సర్ బారిన పడుతున్నారని, ముఖ్యంగా ఊపిరితిత్తుల, రొమ్ము, గర్భాశయ, నోటి క్యాన్సర్లు ఎక్కువగా నమోదవుతున్నాయని హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లలిత కుమారి అన్నారు. కొత్తగూడెం ఏరియా లోని ఏరియా వర్క్‌షాప్‌లో శనివారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన సదస్సు నిర్వహించారు. సింగరేణి ప్రధాన ఆస్పత్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి హెచ్.ఓ.డి జె.క్రిష్టఫర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 4న ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని నిర్వహిస్తారని తెలిపారు. యూనియన్ ఫర్ ఇంటర్నేషనల్ క్యాన్సర్ కంట్రోల్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యం క్యాన్సర్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, ముందస్తు నిర్ధారణ, సమయా నుకూల చికిత్స ప్రాముఖ్యతను తెలియజేయడం, బాధితులకు మానసిక -సామాజిక మద్దతు కల్పించడమే నని అన్నారు. జీవన శైలిలో మార్పులు, ఫాస్ట్ ఫుడ్ అలవాట్లు, ప్లాస్టిక్ వినియోగం, మద్యపానం, ధూమపానం, వ్యాయామం లోపం, కాలుష్యం వంటి అంశాలు క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతున్నట్లు తెలిపారు.

ముందస్తు నిర్ధారణ ద్వారా ప్రారంభ దశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే చికిత్స విజయవంతమయ్యే అవకాశాలు అధికంగా ఉంటాయన్నారు. మహిళలు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రుద్రంపూర్ డిస్పెన్సరీ మెడికల్ సూపరింటెండెంట్ ఎం.పరశురాములు మాట్లాడుతూ.. క్యాన్సర్‌పై అవగాహన జీవన రక్షణకు తొలి అడుగు. సమయానికి నిర్ధారణ, సరైన చికిత్స, ధైర్యం ఉంటే క్యాన్సర్‌ను జయించవచ్చు అని ఆమె పేర్కొన్నారు. అనంతరం వర్క్‌షాప్ ఉద్యోగులు అడిగిన పలు సందేహాలకు వైద్యులు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివైఎన్ ఈటి.అనిల్, ఐఎన్టీయూసీ ఫిట్ కార్యదర్శి, ఎండి సత్తార్ పాషా, ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి ఎం.మధుకృష్ణ, సూపర్‌వైజర్లు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు, ఆల్ ట్రేడ్ అప్రెంటీసులు, డిఎల్ఆర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

దేశంలో అర్హత లేని 32 ఫేక్ యూనివర్సిటీలు

-గుర్తించిన యూజీసీ... తాజాగా ఫేక్ యూనివర్సిటీల జాబితాను విడుదల

హైదరాబాద్ ఫిబ్రవరి 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్);దేశంలో అర్హత లేని ఫేక్ యూనివర్సిటీలు 32 ఉన్నట్లు యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్) గుర్తించింది. ఫేక్ యూనివర్సిటీల జాబితాను తాజాగా విడుదల చేసింది. వీటిలో చదివే, చదవాలనుకునే విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని యూజీసీ హెచ్చరించింది. కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలోని, ఉన్నత విద్యా విభాగం ఆధ్వర్యంలో పని చేసే యూజీసీ.. దేశంలో కొనసాగుతున్న యూనివర్సిటీల అర్హతలపై సమీక్ష చేస్తుంది.తనిఖీలు నిర్వహించి.. తగిన అర్హతలుంటే అనుమతులివ్వడం లేదంటే నిరాకరించడం, బ్లాక్ లిస్టులో పెట్టడం వంటివి చేస్తుంది. ప్రతి ఏటా అలా అర్హత లేని యూనివర్సిటీలను గుర్తించి, నోటీసులు జారీ చేస్తుంటుంది. విద్యార్థులకు అవగాహన కల్పిస్తుంది. దీనిలో భాగంగా తాజాగా దేశంలో 32 యూనివర్సిటీలు ఫేక్ అని వెల్లడించింది. యూజీసీ యాక్ట్ ప్రకారం ఈ యూనివర్సిటీలు ఇచ్చే డిగ్రీలు, పీజీలు వంటివి చెల్లవు. వాటికి చట్టబద్ధత లేదు. అంటే ఆ యూనివర్సిటీలు జారీ చేసే సర్టిఫికెట్లు ఎందుకూ పనికిరావు. ఇలాంటి యూనివర్సిటీల్లో ఢిల్లీ టాప్‌లో ఉంది. ఇక్కడ 12 యూనివర్సిటీలు ఫేక్ అని తేలింది.ఏపీలో గుంటూరులోని క్రిస్ట్ న్యూ టెస్టమెంట్ డీమ్డ్ యూనివర్సిటీ, విశాఖపట్నంలోని బైబిల్ ఓపెన్ యూనివర్సిటీ ఆఫ్ ఇండియా అనే యూనివర్సిటీలు ఫేక్ అని వెల్లడించింది. తాజా జాబితాకు సంబంధించి రాష్ట్రాల వారిగా ఫేక్ యూనివర్సిటీలు ఇలా ఉన్నాయి. ఢిల్లీలో 12, యూపీలో 4, ఏపీలో 2, కర్ణాటకలో 2, కేరళలో 2, మహారాష్ట్రలో 2, పుదుచ్చేరిలో 2, పశ్చిమ బెంగాల్‌లో 2, అరుణాచల్ ప్రదేశ్‌లో 1, హరియాణాలో 1, ఝార్ఖండ్‌లో 1, రాజస్థాన్‌లో 1 చొప్పున యూనివర్సిటీలు ఫేక్ అని తేలింది.

ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ రాష్ట్రపతితో భేటీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ ఈ రోజు (2026 ఫిబ్రవరి 20) రాష్ట్రపతి భవన్‌లో భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ముతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.

మానవాళి మొత్తానికి ప్రయోజనం చేకూరేలా కృత్రిమ మేధ విషయంలో అంతర్జాతీయ సైంటిఫిక్ ప్యానల్‌ను ఏర్పాటు చేయాలన్న ఆంటోనియో గుటెరస్ ప్రతిపాదనను రాష్ట్రపతి సాదరంగా స్వాగతించారు. .

ఏఐ ఇంపాక్ట్ సదస్సును విజయవంతంగా నిర్వహించడంలో భారత్ పోషించిన నాయకత్వ పాత్ర, వివిధ రంగాలలో ఐక్యరాజ్యసమితితో భారత్‌కు ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని ప్రధాన కార్యదర్శి అభినందించారు.

ప్రస్తుత ప్రపంచ అనిశ్చితుల సమయంలో బహుపాక్షికవాదం తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటోందని, దేశాల మధ్య విశ్వసనీయత లోటు పెరుగుతోందని రాష్ట్రపతి పేర్కొన్నారు.

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో ఉన్న పాత వ్యవస్థను తప్పనిసరిగా ప్రస్తుత భౌగోళిక-రాజకీయ వాస్తవ పరిస్థితులను అనుగుణంగా సంస్కరించాలని, నిర్ణయాధికారాల్లో 'గ్లోబల్ సౌత్'కు తగిన ప్రాధాన్యత ఉండాలని ఆమె తెలిపారు. ఐక్యరాజ్యసమితికి ఉన్న ప్రాముఖ్యత, ప్రభావాన్ని కాపాడుకోవడానికి భద్రతా మండలిలో తక్షణ సంస్కరణలే కీలకమని ఆమె ఉద్ఘాటించారు.

'యూఎన్ -80' కార్యక్రమం సంస్కరణలకు ఒక మంచి వేదికను అందిస్తున్నప్పటికీ ఏవైనా పునర్వ్యవస్థీకృత ప్రక్రియలు చేపట్టినప్పుడు 'గ్లోబల్ సౌత్' అభివృద్ధి ప్రాధాన్యతలు దెబ్బతినకుండా రక్షించటం చాలా ముఖ్యమని రాష్ట్రపతి పేర్కొన్నారు.

'త్వరలో బీఆర్ఏఓయూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం'

-వర్సిటీ జెడీ డా.బి. ధర్మానాయక్

నల్గొండ, ఫిబ్రవరి 21: డా.బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల సమ్మేళనంను త్వరలో నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ డా.బి.ధర్మానాయక్ తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వర్సిటీ రీజినల్ కో ఆర్డినేషన్ సెంటర్ పరిధిలోని నల్లగొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థుల సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాబారు. బీఆర్ఏఓయూలో యూజీ, పీజీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులెందరో నేడు సమాజంలో మేథావులు, ఉన్నత ఉద్యోగులుగా, సాఫ్ట్‌వేర్‌తో పాటు వివిధ రంగాల్లో స్థిరపడినట్లు తెలిపారు. వారందరూ అల్యూవిలనిలో రిజిస్ట్రేషన్ కావాలని సూచించారు. దేశంలోనే బీఆర్ఏఓయూ డిజిటల్ యూనివర్సిటీగా ఎంఓయూలు, నూతన కోర్సులను అందుబాటులోకి తెచ్చిందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉమెన్స్ కళాశాల బీఆర్ఏఓయూ కో ఆర్డినేటర్ డా.సుంకరి రాజారామ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ॥ శ్రీనివాసారాజు, బీఆర్ఏఓయూ కౌన్సిలర్స్ బి.రామకృష్ణ, పెరిక మధు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాజస్థాన్ స్కూల్‌లో విషాదం.. బ్లాక్‌బోర్డ్ మీద పడి ఆరేళ్ల చిన్నారి మృతి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:రాజస్థాన్‌లోని ఒక పాఠశాలలో విషాదకర ఘటన జరిగింది. క్లాస్‌రూమ్‌లోని బ్లాక్ బోర్డ్ మీద పడటంతో ఆరేళ్ల చిన్నారి మరణించింది. ఈ ఘటన రాజస్థాన్, జలోర్ జిల్లా, సయ్లా పోలీస్ స్టేషన్ పరిధి, బవాట్రా గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. స్థానికంగా మురుధార్ శిక్షా సంస్థాన్ అనే ప్రైవేటు స్కూల్‌లో ప్రీతి అనే ఆరేళ్ల చిన్నారి రెండో తరగతి చదువుతోంది.

ప్రీతి తోటి విద్యార్థులతో కలిపి క్లాస్ రూంలో ఆడుకుంటూ ఉండగా తరగతి గదిలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బ్లాక్ బోర్డ్, అది ఉంచిన గోడ మీద పడిపోయింది. దీంతో ప్రీతికి తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారిపై మొత్తం బోర్డు, ఇటుకలు, ఇతర శిథిలాలు కూరుకుపోయాయి. గాయపడిన చిన్నారిని వెంటనే స్కూల్ సిబ్బంది దగ్గర్లోని ఆస్పత్రికి తరలించారు. అయితే, ఆలోపే చిన్నారి మరణించింది. ఘటన తర్వాత పాఠశాల యాజమాన్యం పరారీలో ఉంది. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ స్కూల్, బ్లాక్‌బోర్డు, అక్కడి గోడలు అన్నీ చాలావరకు తాత్కాలికంగా ఏర్పాటు చేసినవిగా గుర్తించారు. సిమెంట్ గోడలు, వెదురు బొంగులు వంటి వాటితో స్కూల్‌లో నిర్మాణాలున్నాయి. తాత్కాలిక నిర్మాణాలు చాలా ప్రమాదకరం అయినప్పటికీ స్కూల్‌ను ఇలాగే నిర్వహించిందియాజమాన్యం. పిల్లల భద్రతకు సంబంధించిన కనీస ప్రమాణాలు కూడా స్కూల్‌లో లేవని పోలీసులు విచారణ సందర్భంగా గుర్తించారు.

చిన్నారి మృతి ఘటన నేపథ్యంలో అధికారుల బృందం స్కూల్‌లో తనిఖీ నిర్వహిస్తోంది. అనంతరం పాఠశాలపై తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఇదే సమయంలో రాజస్థాన్‌లో మరో స్కూల్ బిల్డింగ్ కూడా కూలింది. దీంతో అక్కడ స్కూల్ బిల్డింగ్స్ సేఫ్టీపై అనుమానాలు తలెత్తుతున్నాయి. వీటి విషయంలో కచ్చితమైన ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్ నాయకుల రాజకీయ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి నైతిక దాడులు

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు ఆగ్రహం

హైదరాబాద్ ఫిబ్రవరి 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్);కామారెడ్డిలో కాటిపల్లి వెంకట రమణారెడ్డి గారి క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన దాడిని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో చర్చకు స్థానం ఉండాలి గానీ, హింసకు కాదు. కాంగ్రెస్ నాయకుల రాజకీయ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ఈ విధమైన అల్లర్లకు పాల్పడటం అత్యంత దుర్మార్గం. శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. కామారెడ్డిలో ప్రజల ప్రశాంతతకు భంగం కలిగిస్తే బిజెపి సహించదని హెచ్చరించారు.ఇలాంటి రాజకీయ హింసాత్మక చర్యలకు ప్రజాస్వామ్యంలో ఏమాత్రం స్థానం లేదు. మా పార్టీ కార్యకర్తలకు అండగా నిలవడం కోసం, అలాగే పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించి నిజాలు ప్రజల ముందుకు తీసుకురావడం కోసం నేను స్వయంగా సంఘటన స్థలాన్ని సందర్శిస్తాను. హింసను ప్రోత్సహించే రాజకీయాలను భారతీయ జనతా పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని పేర్కొన్నారు.

పరువునష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి ఊరట

భివాండీ ఫిబ్రవరి 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్);పరువునష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కి ఊరట లభించింది. మహారాష్ట్ర లోని భివాండీ కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. మహాత్మాగాంధీ హత్య వెనుక ఆరెస్సెస్ హస్తం ఉందని 2014లో రాహుల్‌గాంధీ ఆరోపి ంచారు. ఈ వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ ఆరెస్సెస్ కేసు వేసింది.మహారాష్ట్రలోని భివాండీ కోర్టులో ఈ కేసు విచారణ జరిగింది. ఇవాళ జరిగిన విచారణకు రాహుల్‌గాంధీ స్వయంగా కోర్టుకు హాజరయ్యారు. ఈ క్రమంలో న్యాయస్థానం ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. 2014 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మహారాష్ట్రలోని సోనాలే గ్రామంలో జరిగిన ర్యాలీలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. అక్కడ ఆయన మాట్లాడుతూ.. ఆరెస్సెస్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. మహాత్మాగాంధీ హత్య వెనుక సంఘ్ హస్తం ఉందని రాహుల్‌గాంధీ ఆరోపించారు. దాంతో రాహుల్ వ్యాఖ్యలు ఆర్ఎస్ఎస్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొంటూ.. అప్పట్లో సంఘ్ కార్యకర్త రాజేష్ కుంటే మేజిస్ట్రేట్ కోర్టులో ఫిర్యాదుచేశారు. ఆ కేసు విచారణలో ఇప్పుడు రాహుల్‌గాంధీకి బెయిల్ మంజూరయ్యింది.

పాలిటెక్నిక్ కాలేజీ నిర్మాణ పనుల నాణ్యతలో రాజీ పడొద్దు : ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ, ఫిబ్రవరి 21:: 1955 సంవత్సరంలో దేశ తొలి ప్రధాని నెహ్రూ హయాంలో నిర్మితమై, 70 ఏళ్ల ఘన చరిత్రతో ప్రపంచానికి వేలాది మంది ఇంజనీర్లను అందించిన వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ రూ. 28 కోట్లతో పునర్నిర్మాణ పనుల్లో అధికారులు, గుత్తేదారులు రాజీ పడవద్దని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సూచించారు.

శనివారం ఆయన వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. కాలేజీ ప్రధాన భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. నిర్మాణ పనుల్లో ఎక్కడా కూడా నాణ్యత ప్రమాణాల్లో రాజీ పడకుండా, దీర్ఘకాలం నిలిచేలా నిర్మాణం చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యా అవగాహన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ రామప్రసాద్, ప్రభుత్వ పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు , కాంగ్రెస్ నాయకులు, కాలేజీ అధ్యాపకులు, సిబ్బంది పి.శ్రీనివాస్, శివకుమార్, పూర్వవిద్యార్థులు బొద్దిరెడ్డి సతీష్‌రెడ్డి, టీ.ఎన్.స్వామి, ప్రకాశ్, సుధాకర్‌రావు, దొడ్డిపల్లి కుమార్, వసంత్‌కుమార్, శశికుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

నాగర్ కర్నూల్ మండలం కుమ్మెర మల్లన్న జాతరలో అమానుష ఘటన

-బీసీ కుటుంబాన్నినిర్వాహకులు గుడిలోకి అనుమతించని వైనం

- ప్రశ్నించినందుకు దాడి.. చిన్నారి తీవ్ర అస్వస్థత

-ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూమృతి

నాగర్ కర్నూల్ ఫిబ్రవరి 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్);నాగర్ కర్నూల్ మండలం కుమ్మెర మల్లన్న జాతరలో అమానుష ఘటన చోటుచేసుకుంది. జాతర నిర్వాహకులు సర్పంచ్ సహా తుకారాం రెడ్డి, ఉంద్యాల శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సతీష్ రెడ్డి కన్నిరెడ్డి, కుఫేందర్ రెడ్డి, మల్లన్న దర్శనం కోసం వెళ్లిన చాకలి చంద్రకళ కుటుంబాన్నిఅడ్డుకొని దాడి చేశారు.తక్కువ జాతి వారని సదరు బీసీ కుటుంబాన్నినిర్వాహకులు గుడిలోకి అనుమతించలేదు. దేవుడి దర్శనం చేసుకోకుండా తమను ఎందుకు అడ్డుక ంటున్నారని ప్రశ్నించినందుకు చాకలి చంద్రకళను, ఆమె కొడుకు గణేష్‌ను, కోడలిని, కూతురిని బూతులు తిడుతూ నిర్వాహకులు దారుణంగా కొట్టారు.రెండు నెలల చిన్నారి మొహం చూసైనా తమను వదిలేయమని చంద్రకళ కుటుం బసభ్యులు వేడుకున్నా కనికరించకుండా నిర్వాహకులు ఆ చిన్నారిని కాలుతో తన్నారు. ఈ దాడిలో తీవ్ర అస్వస్థతకు గురైన చిన్నారిని ఆసుపత్రికి తరలించ గా.. చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయింది.చంద్రకళ కుటుం బసభ్యులు నిర్వాహకులపై ఫిర్యాదు చేయడా నికి వెళ్తే.. నాగర్ కర్నూల్ పీఎస్ లో పోలీసులతిరిగి బాధితులనే బెదిరించడం గమనా ర్హం. నిర్వాహకులు కాంగ్రెస్ పార్టీకి చెందిన అగ్రకుల వ్యక్తులు కావడంతో పోలీసులు తమ ఫిర్యాదు తీసుకోవడం లేదని, తమకు న్యాయం చేసి రక్షణ కల్పించాలని బాధితుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాలికలకు శాపం.. ముందస్తు రుతుక్రమం

ముందుతరం వారితో పోలిస్తే ఐదేళ్ల వ్యత్యాసం

-వాతావరణంలో మార్పులు, పోషకాహార లేమి తో చిన్న వయస్సులో రుతుక్రమం

హైదరాబాద్ ఫిబ్రవరి 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ఆడపిల్ల జీవితంలో 'రుతుక్రమం (రజస్వల)' కీలకమైన ఘట్టం. శారీరకంగా, మానసికంగా పలు మార్పులు చోటుచేసుకునే సహజ సందర్భం. హార్మోన్ల స్థాయిల్లో హెచ్చుతగ్గులవల్ల కలిగే ఈ ప్రక్రియ, సాధారణంగా 13 15 ఏళ్ల వయస్సుమధ్యలో చోటు చేసుకుంటుంది. యవ్వనంలోకి అడుగిడుతున్న ఆడపిల్లలో రుతుక్రమం మొదలవుతుంది. ఈస్ట్రొజన్, ప్రొజెస్టెరాన్ హార్మోన్ల మార్పుల వల్ల అండాశయంనుంచి అండం విడుదలకావడంతో ఈ ప్రక్రియ ఆరంభమవుతుంది. ఇది స్త్రీ పునరుత్పత్తి ఆరోగ్యానికి, శారీరక ఎదుగుదలకు, గర్భధారణ సామర్థ్యానికి సంకేతంలా నిలుస్తుంది. కానీ, వాతావరణంలో మార్పులు, పోషకాహార లేమి తదితర కారణాల వల్ల చిన్న వయస్సులోనే రుతుక్రమం గురవుతున్న బాలికల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. దీంతో పిల్లలతోపాటు తల్లిదండ్రులు మానసిక క్షభకు గురవుతున్నారు. ఎదిగీఎదగని వయస్సు, ఆడుతూ పాడుతూ గడిపే కాలం, ప్రాథమిక తరగతి చదువుతున్న క్రమంలో (అంటే 9..11 ఏళ్ల వయస్సు) రుతుక్రమం (ఎర్లియర్లీ మెచ్యూర్) చోటుచేసుకుంటోంది. ఆహారపు అలవాట్లు మారడం, అల్ట్రాప్రాసెస్డ్ ఫుడ్ అధికంగా తీసుకోవడం, శారీరక వ్యాయామం లేకపోవడం, తీసుకునే ఆహారంలో ఐరన్ లోపించడం, బాడీ మాస్ ఇండెక్స్(బిఎంఐ) అనూహ్యంగా పెరిగి హార్మోన్ల సమతుల్యత దెబ్బతినడంతో చిన్నవయస్సులోనే రుతుక్రమం చోటుచేసుకుంటోంది. హోమ్ అప్లయెన్సెస్ ఊహతెలియని వయస్సులో పిరియడ్ సైకిల్ ప్రారంభం కావడంతో తల్లిదండ్రులు భయాందోళనలకు గురవుతున్నారు. చిన్నారులకు అవగాహన కల్పించినా ఏమేరకు నెట్టుకురా గలుగుతారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వాస్తవానికి, రుతుక్రమం యవ్వనానికి చేరువవుతోన్న అమ్మాయిల్లో శారీరకంగా, మానసికంగా పలు మార్పులు రావడం సహజం. హార్మోన్ల స్థాయిలో హెచ్చుతగ్గులవల్ల వచ్చే ఈ మార్పులు టీనేజీ దశలో ప్రవేశించి అమ్మాయిలకు అసౌకర్యం, ఇబ్బందిని కలుగజేస్తున్నాయి. పైగా ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదముంది. ముఖ్యంగా మెట బాలిక్ సిండ్రోమ్, టైప్2 మధుమేహం, హైపర్ టెన్షన్ వంటి సమస్యలు వచ్చే అవకాశముంది. రుతుక్రమం అయిన తొలి ఐదారేళ్ల వరకు నాణ్యమైన అండాలు ఉత్పత్తి అయినప్పటికీ, చివరి పదేళ్లలో అండాల ఉత్పత్తిలో నాణ్యత తగ్గడం, ఆలస్యంగా వివాహం చేసుకోవడం వల్ల సంతానోత్పత్తి తగ్గుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రతి బాలిక తన జీవితకాలంలో ఒక నిర్దిష్ట వయస్సులో రుతుక్రమం కావడం జరుగుతుంది. కొంత మందిలో పన్నెండేళ్ల వయస్సు దాటినప్పటికీ రుతుక్రమం కోసం ఎదురుచూస్తుంటారు. గతంలో పదహారేళ్ల వయస్సులో రుతుక్రమం అయ్యేది. తర్వాత కాలంలో చాలా మంది అమ్మాయిలు 12 15 ఏళ్ల వయస్సులో రుతుక్రమం జరుగుతుండేది. ప్రస్తుత కాలంలో బాలికలు తమ మొదటి పీరియడ్‌ను చాలా ముందుగానే పొందుతున్నారు. ముందుతరం వారితో పోలిస్తే ఐదేళ్ల వ్యత్యాసముంటోంది. సాధారణంగా బాల్యం చివరి దశలో ప్రారంభమయ్యే ప్రక్రియ ఇది. యుక్త వయస్సు రావడానికి ముందు హైపోథలమస్, పిట్యూటరీ, అండాశయాలు పరిపక్వ స్థితికి చేరుకుంటాయి. పదేళ్ల వయస్సులో మొదలైన ప్రక్రియ రెండు మూడేళ్లు కొనసాగి అప్పుడు రుతుక్రమంకు దారితీసేది. ప్రస్తుతం ఇందుకు భిన్నంగా పదేళ్ల కన్నా తక్కువ వయస్సులో రుతుక్రమం రావడం అసాధారణ సందర్భంగానే వైద్యులు పేర్కొంటున్నారు.చిన్న వయస్సులో రుతుక్రమం రావడానికి దారితీస్తున్న పరిస్థితులపై ప్రపంచ వ్యాప్తంగా పలు పరిశోధనలు జరుగుతున్నాయి. ఆర్థిక నేపథ్యం నుంచి ప్రతి అంశం వారిని ప్రభావితం చేస్తు న్నట్లు గుర్తించారు. కొంతమంది బాలికలు ఐదేళ్ల వయస్సులోనే రుతుక్రమంకు గురవుతున్నట్లు తేలింది. ఇందుకు ఆర్థిక అంశా లు మాత్రమే కాకుండా శారీరక అంశాలు, వాతావరణ పరిస్థితులు, పుట్టిన శిశువు తీసుకునే మందులు ప్రభావితం చేస్తున్నట్లు తేల్చారు. యాంటీబయోటిక్స్ ఒక కారణంగా దక్షిణ కొరియాలో జరిగిన ఓ అధ్యయనం తెలియజేస్తోంది. రెండు లక్షలమంది ఆడపిల్లలపై జరిపిన ఈ అధ్యయనం.. పుట్టిన పిల్లల దగ్గర్నుంచీ తొమ్మిదేళ్ల వయస్సు వరకూ గమనించారు. పుట్టిన తొలి మూడు నెలల్లో యాంటీబయోటిక్స్ తీసుకున్న ఆడశిశువుల్లో 22% మంది ఎనిమిదేళ్లకంటే ముందుగానే రుతుక్రమం అవుతున్నట్లు గుర్తించారు. ఈ పరిస్థితిని సిపిపి (సెంట్రల్ ప్రికాషియస్ ప్యుబర్టీ) అంటారు. పుట్టిన తొలి రెండు వారాల్లో యాంటీ బయోటిక్స్ ఇస్తే ఈ సమస్య తీవ్రంగా ఉంటుందంటున్నారు. శరీరంలోకి చేరిన యాంటీ బయోటిక్స్ ఆడపిల్లల హార్మోన్ల వ్యవస్థని అదుపు తప్పేలా చేయడం వల్లనే త్వరగా రుతుక్రమం అవుతుందని ఈ అధ్యయనం తెలియజేస్తున్నది. అధిక బరువు, ఊబకాయం, శారీరక శ్రమ తక్కువగా ఉండడం కారణమవుతున్నాయి. మొబైల్, టివిలను ఎక్కువ సమయం వీక్షించే బాలికల్లో యుక్తవయస్సు త్వరగా ప్రారంభమవుతుందని, ఇవి తమ మొదటి పీరియడ్స్‌ను ప్రేరేపిస్తుందని వివరించారు. బాలికల్లో ఎర్లీ పీరియడ్స్‌కు పరిసర ప్రాంతాలు కూడా ఓ కారణంగా నిలుస్తుందని పరిశోధ కులు తెలియజేస్తున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలనే తేడా లేకుండా 70 శాతానికిపైగా ఆడపి ల్లలకు 'రుతుక్రమం' విషయం తెలియదనే చెప్పాలి. ఒకసారి పీరియడ్స్ ప్రారంభమవుతే, శారీరక పరిశుభ్రత చాలా అవ సరం. ఈ విషయంలో కూతురితో మాట్లాడటానికి తల్లి చొరవచూ పాలి. జరిగే పరిణా మాలు, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి కూలంకషంగా చర్చించాలి. తీసుకునే ఆహారం విషయంలో పోషకాలకు చోటి వ్వడం, ఆత్మనూన్యతకు గురికా కుండా అప్రమత్తం చేయడం తల్లిపాత్ర కీలకంగా ఉంటుంది. శరీర నిర్మాణం, రుతుచక్రం రావడం గురించి విపులంగా వివరించాలి. ఇదిలా వుండగా, ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కీలకమైంది. ద్విసభ్య ధర్మా సనం వెలువరించిన ఆదేశాల ప్రకారం విద్యార్థినుల నెలసరి ఆరోగ్య సమస్యను భారత రాజ్యాంగం లోని జీవించే హక్కులో భాగమని విశ్లేషించింది. నెలసరి నిర్వహణ వారి విద్యార్జన సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తే, అది వారి విద్యా హక్కునూ, వారికి గల గౌరవప్ర దమైన జీవించే హక్కు నూ ప్రభావితం చేసినట్టేనని పేర్కొంది. కాబట్టి, ఆడపిల్లల ఆర్యోగాన్ని పరిరక్షించే విధానాలు ప్రభుత్వా లు చేపట్టడం అత్యంత ఆవశ్యకతగా పేర్కొంది.

యుఎస్ఎ సుప్రీంకోర్టు తీర్పును తప్పుబట్టిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్

న్యూయార్క్ ఫిబ్రవరి 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: యుఎస్ఎ సుప్రీంకోర్టు తీర్పును అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తప్పుబట్టాడు. సుప్రీం నిర్ణయం దేశానికే అవమానకరమని, సుప్రీంకోర్టు జడ్జిలని చూసి సిగ్గుపడుతున్నానని, జడ్జిల తీర్పు తీవ్రంగా నిరాశపర్చిందని దుయ్యబట్టారు. ట్రంప్ విధించిన సుంకాలు చెల్లబోవు అని అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేసిన సందర్భంగా డోనాల్డ్ ట్రంప్ మీడియాతో మాట్లాడారు. సుప్రీంకోర్టు జడ్జిలు విదేశీ ప్రభావానికి లోనయ్యారని, ఎట్టి పరిస్థితుల్లో టారిఫ్ విషయంలో వెనక్కి తగ్గేదే లేదని స్పష్టం చేశారు. ట్రంప్ సుంకాల వ్యతిరేకించిన వారిలో ఆరుగురు జడ్జిల్లో నలుగురు మహిళలు అమికోనీ బారెట్, సోనియా సోటోమేయర్, ఎలెనా కగన్, కేతాంజీ బ్రౌన్ జాక్సన్, ఇద్దరు పురుషులు జాన్ రాబర్ట్స్, నీల్ గోర్సుచ్ ఉన్నారని తెలియజేశారు. ట్రంప్ సుంకాలను సమర్థించిన ముగ్గురు జడ్జిల్లో క్లారెన్స్ థామస్, బ్రెట్ కవనాఫ్, శామ్యూల్ అలిటో ఉన్నారన్నారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత 10 శాతం గ్లోబల్ టారిఫ్ ఆర్డర్స్ పై డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. ఆయనకు అత్యంత ఇష్టమైన పదం టారిఫ్ అని ప్రకటించుకోవడమే కాకుండా... ఎడాపెడా సుంకాలు వేస్తూ ప్రపంచ దేశాలను భయభ్రాంతులకు గురిచేయడమే కాకుండా తన దారి కి తెచ్చుకుంటున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు భారీ షాక్ తగిలిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు ట్రంప్ విధించిన సుంకాలు చెల్లబోవు అని అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఆయా దేశాల వద్ద నుంచి వసూలు చేసిన అదనపు సుంకాలను తిరిగి వారికి చెల్లించాలని స్పష్టం చేసింది. ట్రం ప్ తన అధికారాలను అతిక్రమించారని మొట్టికాయలు వేసింది.

బుర్రకథా పితామహుడు నాజర్

ఫిబ్రవరి 22...నాజర్ వర్ధంతి

ప్రాచీన జానపద కళారూపమైన బుర్రకథకు కొత్త జీవం పోసి, మెరుగులు దిద్ది, ప్రత్యేక ఆహార్యంతో తగిన హావ భావ లతో ఎన్నో ప్రదర్శనలిచ్చి బుర్రకథా ప్రక్రి యకు విస్తృత ప్రచారం కల్పించిన బుర్రకథా పితామహుడు నాజర్, నటుడు, ప్రజా రచయిత, గాయకుడు. " ఈ గండపెం డేరాలూ, ఊరేగింపులూ, సన్మానాలూ, పద్మశ్రీలూ అన్నీ కలిపి, నాకు జనం వేసే ఒక్క ఈలతో సాటి కాదు" అని తన కళను ప్రజా ప్రయోజనానికే అంకితం చేసిన ప్రజా కళాకారుడు.

అంగాంగ విన్యాసాల ద్వారా ఆటపాట ద్వారా జాతిని మేల్కొలిపి ఉత్తేజపరిచిన గొప్ప ప్రతిభాశాలి షేక్ నాజర్.

నాజర్ ప్రతిభకు ముగ్ధుడైన సినీ సంగీత దర్శకులు సాలూరు రాజేశ్వరరావు సినీరం గంలో స్థిరపడమని కోరినా, ఆ లోకం తన లోకం కాదని సవినయంగా చెప్పి, జనపదమే తన పథమని బుర్రకథలు చెప్పుకుంటూ జనంతో మమేకమై, జీవితాంతం ప్రజా కళాకారుడిగా కొనసాగిన ప్రజా గాయకుడు నాజర్.

బుర్రకథా పితామహుడుగా పేరొందిన షేక్ నాజర్ (ఫిబ్రవరి 5, 1920 – ఫిబ్రవరి 22, 1997) బుర్రకథా కళాకారుడు, నటుడు, ప్రజా రచయిత, గాయకుడు. పద్మశ్రీ అవార్డు గ్రహీత. గుంటూరు జిల్లా పొన్నెకల్లు గ్రామంలో ఓ పేద దూదేకులముస్లిం కుటుంబంలో 1920, ఫిబ్రవరి 5 వ తేదీన షేక్ మస్తాన్, బీబాబీలకు దంపతులకు జన్మించారు. నాజరు పూర్తి పేరు "షేక్ నాజరు వలి". మహ్మదీయ సభ పేరిట నాటకా లాడి మంచిపేరు గడించారు. ఆయన కృష్ణలీలలో దేవకి, శ్రీ కృష్ణ తులాభారంలో రుక్మిణి, భక్త రామదాసులో ఛాందిని వంటి ఆడవేషాలు వేసి మెప్పించారు. పాదుకా పట్టాభిషేకంలో కైకేయి, ఖిల్జీ రాజ్యపతనంలో కమలారాణి పాత్రలు పోషించారు. పాఠశాల స్థాయిలో "ద్రోణ" పాత్రకు జీవం పోశారు. ఆర్యమత సిద్ధాంతం నచ్చి మాంసాహారం మానేశారు. నాస్తికుడయ్యారు.

తెనాలిలోని "బాలరత్న నాటక సమాజం" లో ప్రారంభమైన నాజర్ కథాకథన ప్రస్థానం నాలుగు దశాబ్దాలు సాగింది. కమ్యూనిస్టు పార్టీలోచేరి ప్రజానాట్య మండలి వేదిక ద్వారా పార్టీ సిద్ధాంతాలను కార్యక్రమాలను బుర్రకథల ద్వారా ప్రచారం చేశారు. వీరిని 1940వ దశకంలో కమ్యూనిస్టు పార్టీ నెల జీతం మీద కథలు చెప్పించి పల్లెలలో తమ పార్టీ ప్రచారానికి ఉపయోగించు కున్నది. పల్నాటి యుద్ధం, వీరాభిమన్యు, బొబ్బిలి యుద్ధం, అల్లూరి సీతారామరాజు, ప్రహ్లాద, క్రీస్తు, బెంగాల్ కరువు మొదలగు ఇతివృతాలలో సమకాలీన రాజకీయాలు జోడించి బుర్రకథలు రూపొందించారు. పద్మశ్రీ నాజర్ జీవిత చరిత్రను అంగడాల వెంకట రమణమూర్తి... పింజారీ అనే పుస్తకంగా ప్రచురించాడు. కొంతకాలం విరసం సభ్యులుగా ఉన్నారు.

అగ్గిరాముడు, బలేబావ, నిలువు దోపిడీ, పెత్తందార్లు, పుట్టిల్లు, మనుషులంతా ఒక్కటే – సినిమాల్లో నాజర్ బుర్రకథలు కన్పిస్తాయి. పూల రంగడు సినిమాలో "అక్కినేని"కి నేర్పించారు. చాలా మందికి ఈ గాంధర్వ విద్య నేర్పారు. ఆయన గళ గాంభీర్యాన్ని, మాధుర్యాన్ని గమనించి, "ఆసామీ" నాట కాన్ని రచించారు. ఆంధ్రనాటక కళాపరిషత్తు పోటీల్లో ఆసామీ నాటకం ప్రథమ బహుమతి పొందింది. నాజర్ ఏడుసార్లు జైలు జీవితాన్ని అనుభవించారు.

ఆంధ్రనాటక అకాడమీ 1981లో "ఉత్తమ కళాకారుడు" అవార్డుతో సత్కరించింది. 1986 లో భారత ప్రభుత్వం "పద్మశ్రీ" బిరుదుతో నాజరును సత్కరించింది. రంగస్థల మహానటుడు బళ్లారి రాఘవా చార్యులు, నాజరు బుర్రకథ విని అమితానందంతో బళ్లారికి ఆహ్వానించడం, మద్రాసులో ప్రదర్శన చూచిన గోవిందరాజుల సుబ్బా రావు నాజరుని అభినందిస్తూ కౌగిలించు కోవడం, ప్రముఖ పాత్రికేయుడు కె. అబ్బాస్ నాజరును "ఆంధ్ర అమరషేక్" అని అభివర్ణించడం కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య నాజరు ప్రజా భాషకు ముగ్ధుడై "నా బిడ్డడు ఎంత ఎదిగిపోయాడో" అని ఆలింగనం చేసుకోవడం, నాజరు లోని కళా ప్రతిభకు తిరుగులేని నిదర్శనాలు.

"నాటకాల్లో బుర్రకథ బ్రహ్మ నాజర్ దగ్గర శిక్షణ తీసుకోవటం నా నట జీవితానికి పట్టం కట్టింది" అని ప్రముఖ నటి జమున వ్యాఖ్యానించారు. గుంటూరుకు ఎన్‌టిఆర్ వచ్చినప్పుడు "నేను మీ అభిమానిని" అని నాజర్ చెపితే... "నేను మీ ఫాన్‌ను" అని ఎన్‌టిఆర్ చెప్పి అందరినీ ఆనంద పరిచారు.

"హరికథకు ఆదిభట్ల ఎలాంటివాడో బుర్రకథకు నాజర్ అలాంటివాడు" అని ముదిగొండ శివప్రసాద్ తదితర

ప్రముఖుల అభిప్రాయాలు ఉంటే నాజర్ గొప్పతనం స్పష్టం అవుతున్నది. కటిక పేదరికాన్ని మరణించే వరకు అనుభవించిన నాజర్ 1997, ఫిబ్రవరి 22 న అంగలూ రులో మరణించారు.

–రామ కిష్టయ్య సంగన భట్ల,
9440595494

క్రమశిక్షణ, నిబద్ధతతో ప్రజల మన్ననలను పొందేలా పని చేయాలి

-నిత్య జీవనంలో వాకింగ్, వ్యాయామం భాగం చేసుకోవాలి -అదనపు ఎస్పీ చంద్రయ్య

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 21:రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయ అవరణలోని పరేడ్ మైదానంలో జిల్లా ఎస్పీ మహేష్ బి గితే ఆదేశాల మేరకు జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్,సివిల్,హోమ్ గార్డ్ సిబ్బందికి వీక్లీ పరేడ్ నిర్వహించారు.పరేడ్ లో భాగంగా సిబ్బంది ప్రదర్శించిన ఆర్మ్డ్ డ్రిల్, ఫుట్ డ్రిల్, లాఠీ డ్రిల్, ట్రాఫిక్ డ్రిల్ లను అదనపు ఎస్పీ చంద్రయ్య పరిశీలించారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బంది ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ప్రతిరోజు ఉదయాన్నే కనీసం ఒక అరగంట వ్యాయామం, నడక ఏదో ఒకటి చేయాలని, సాధ్యమైనంత వరకు బయట ఆహారం తినడం మానివేయాలన్నారు.రెగ్యులర్ గా హెల్త్ చెకప్ చేసుకోవాలని ఎస్పీ గారు తెలిపారు. వీక్లీ పరేడ్ వల్ల సిబ్బందికి క్రమశిక్షణ,యూనిటీగా ఉండడం, ఫిజికల్ ఫిట్నెస్ కి ఉపయోగపడుతుందన్నారు.క్రమశిక్షణతో డ్యూటీలు నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందేలాగా పనిచేస్తూ పోలీస్ శాఖకి, జిల్లాకి మంచి పేరు తెచ్చేలాగా పని చేయాలని అన్నారు. సిబ్బందికి ఏదైనా సమస్య వుంటే ఎప్పుడైనా తనను కలుసుకొని తమ సమస్యను తెలియజేసుకోవచ్చని అన్నారు.ఈ పరేడ్ లో ఆర్ఐలు, సిఐలు కృష్ణ, మధుసూదన్, యాదగిరి, రమేష్,ఎస్ఐలు కిరణ్ కుమార్, సాయి కిరణ్, జునైద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వేములవాడ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ బాధ్యతలు

–నూతన పాలకవర్గానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుభాకాంక్షలు

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 21 నేటినిజం (ప్రతినిధి): వేములవాడ మున్సిపల్ చైర్మన్ గా పుల్కం రాజు, వైస్ చైర్మన్ గా నరాల శేఖర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.ప్రజల సమస్యల పరిష్కారం ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని కోరారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని స్వదినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.గత ఎన్నికల ప్రచార సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని తెలిపారు. ఎన్నికలో మున్సిపల్ పీఠం పై కాంగ్రెస్ జెండా ఎగిరేలా ఆశీర్వాదాలు అందించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు.పట్టణ ప్రజలు మనకు పాస్ మార్కులు ఇచ్చారని, రానున్న రోజుల్లో ఫస్ట్ క్లాస్ మార్కులు పొందేలా పని చేయాలని కోరారు. ప్రజల మన్ననలు పొందాలని పేర్కొన్నారు.రాజన్న ఆలయానికి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులతో కలిసి పని చేయాలని సూచించారు. వేగంగా విస్తరిస్తున్న వేములవాడ పట్టణంలో సకల వసతులు కల్పించాలన్నారు.గత రెండు సంవత్సరాలుగా జరుగుతున్న అభివృద్ధి కొందరికి కనిపిస్త లేదని, వారికి మనం చేస్తున్న అబివృద్ధి వారి కళ్ళకు కనిపించేలా వాడ వాడల అబివృద్ధి చేయాలని కోరారు.గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 వరకు ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ వంటి అనేక పథకాలను అమలు చేస్తున్నామని వ్యాఖ్యాని ంచారు.ప్రజా ప్రభుత్వంపై కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని కోరారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం 70 ఏళ్లలో చేయని అప్పును కేసీఆర్ కేవలం 10 ఏళ్లలో చేశారని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధిలో దూసుకు పోతుందని తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ ద్వారా రాష్ట్రంలో పెట్టు బడుల వరద పారుతుందని పేర్కొన్నా రు. రాజన్న ఆలయా న్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కొందరికి కళ్ల ముందు జరిగిన అబివృద్ధి కనిపిస్తలేదని, గత పది సంవత్స రాలలో వారు గాలికి వదిలేసిన పనులు మేము చేస్తున్నామని వెల్లడించారు.పది సంవత్సరా లలో బిఆర్ఎస్ వారు అబివృద్ధి చేయకుండా కాలాపాన చేసి నేడు ఏదో ఏదో మాట్లాడుతు న్నారని, ప్రశ్నించే గొంతులకు ప్రజలు అవకాశం ఇస్తారని చాటి చెప్పాం .గత ప్రభుత్వ హయాంలో బ్రిడ్జి కోసం ఆలయ అభివృద్ధి కోసం సూరమ్మ చెరువు పనులు కోసం అనేక వాటిపై పోరాటాలు చేశామని, నేడు అధికారంలోకి వచ్చిన వెంటనే వాటి పనులను ముమ్మరంగా చేస్తున్నామని స్పష్టం చేశారు.త్వరలోనే కలికోట సూరమ్మ చెరువు, మర్రిపల్లి ప్రాజెక్ట్ పనులు పూర్తి అవుతు న్నాయని, ఆనాడు మేము చేసిన పోరాటం చేసిన వాటిలో 90 శాతం పనులు పూర్తి చేశామ న్నారు.వేములవాడ నుండి 180 కోట్లతో చందుర్తి రుద్రంగి మీదిగా సిరికొండ వరకు 100 ఫిట్ల రోడ్డు పనులకు నిధులు మంజూరు అయ్యాయనీ, హను మాజీ పేట నుండి అజ్మరా తండా వరకు 25 కోట్లతో రోడ్డు నిర్మాణం కోసం నిధులు మం జూరు అయ్యాయన్నారు.మన ప్రాంతంలో కక్ష సాధింపు రాజకీయాలకు తావు లేదనీ, ఇంత నియర్ డియర్ ఫ్రెండ్లీ ఎవ్మెల్యే ఎక్కడ కనిపించ ారన్నారు.అన్ని వర్గాల ప్రజలను కలుపుకుపోతూ మందుకు పోవాలన్నారు. వేములవాడ పట్టణంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధికి నూతన పాలక వర్గం పాటు పడుతుందన్నారు.నూతన పాలకవర్గం ప్రజల ఇచ్చిన అవకాశాన్ని స్వదినియోగం చేసుకోవాలనీ కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తుమ్ మధు, తోటరాజు, కాశ శ్రీనివాస్, సిరిగి రి సంగీత, కృష్ణవేణి, కొండ శేఖర్,ఇ వప్పుల మమత, అన్నారం శ్రీనివాస్, టైలర్ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు

అత్యుత్తమ నాణ్యతతో తాజా ఉత్పత్తులే లక్ష్యం

హైదరాబాద్, ఫిబ్రవరి 21: అత్యుత్తమ నాణ్యతతో కూడిన తాజా ఉత్పత్తులే తమ లక్ష్యమని హెరిటేజ్ ఫుడ్స్ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఇంటికి తాజా, ఆరోగ్యకరమైన ఉత్పత్తులు అందించడం, రైతులకు సాధికారత కల్పించడం ఇవే లక్ష్యమన్నారు. లక్షలాది మంది పాడి రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తూ 33 ఏళ్ల ప్రస్థానాన్ని ఘనంగా కొనసాగిస్తున్నామన్నారు. నాలుగు కోట్లతో చిన్న సంస్థగా మొదలైన ఈ సంస్థ ఇప్పుడు రూ.4,000 కోట్లతో భారీ సంస్థగా ఎదిగిన ఈ ప్రయాణంలో 'పారదర్శకత', 'నాణ్యత' తమ విజయ రహస్యాలని పునరుద్ఘాటించారు. మా లక్ష్యానికి కట్టుబడి ఉంటామన్న వాగ్దానం, వినియోగదారులను సంతోషపెట్టడం అనే రాజీలేని నమ్మకంతో మొదలవుతుందని తెలిపారు. నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లో వెనకడుగు వేయమన్నారు. అది పాలు, పెరుగు, నెయ్యి, పనీర్, ఐస్‌క్రీమ్ ఏ ఉత్పత్తి అయినా సరే నాణ్యతతో ఉండాల్సిందేనన్నారు. మేము తయారు చేసే ప్రతీ ఉత్పత్తి ఐదు కీలక తనిఖీ కేంద్రాల ద్వారా 25 నాణ్యత పరీక్షలకు లోనవుతుందని పేర్కొన్నారు. ఈ పరీక్షలు నిబంధనలు సూచించిన దాని కంటే అత్యున్నత పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలను కలిగి ఉంటాయన్నారు.

ఉన్నత ప్రమాణాలతో కూడిన ఉత్పత్తులు ప్రతి ఇంటికి తాజాగా, సురక్షితంగా, పోషక విలువలతో చేరేలా చూడటం కోసం 500 మందికి పైగా అంకితభావం కలిగిన నాణ్యతా నిపుణులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ఎందుకంటే, మీరు మీ కుటుంబానికి వడ్డించేది కేవలం ఆహారం మాత్రమే కాదని, అది ఒక 'నమ్మకం' అని వివరించారు. ఆ బాధ్యతను గౌరవిం చాల్సిందేనన్నారు. హెరిటేజ్ వాగ్దానం మీ ఇంటి గుమ్మం దగ్గరే ఆగిపోదన్నారు. రైతులకు సాధికారత కల్పించడం కూడా మా అస్తిత్వంలో ఒక ప్రధాన భాగం అన్నారు. తొమ్మిది రాష్ట్రాల్లో సుమారు మూడు లక్షల మంది పాడి రైతులతో కలిసి పని చేస్తున్నామన్నారు. మూడు దశాబ్దాలకు పైగా ఈ బంధాన్ని కొనసాగిస్తున్నామన్నారు. ఈ భాగస్వామ్యం మూడు శక్తివంతమైన సూత్రాలపై ఆధారపడి ఉందన్నారు. అవి మొదటిది సమయానుకూల చెల్లింపు అన్నారు. ప్రతి నెలా రెండు నుంచి మూడు సార్లు, అనుకున్న సమయానికి, ప్రతిసారీ చెల్లింపులు చేయడమన్నారు. గత 30 ఏళ్లలో ఒక్కసారి కూడా చెల్లింపు రోజును వదులుకోలేదన్నారు. రెండవది పూర్తి పారదర్శకత అన్నారు. పరీక్షలు, కొలతలు, కమ్యూనికేషన్‌లో పూర్తి స్పష్టత ఉంటుందన్నారు. మా రైతులకు ప్రతిరోజూ తాము ఎంత సంపాదిస్తున్నారో కచ్చితంగా తెలుస్తుందన్నారు. మూడవది సరసమైన, పోటీ ధర అన్నారు. నాణ్యత, పరిమాణం ఆధారంగా సరైన ధరను అందించడం ద్వారా వారి గౌరవాన్ని, ఆర్థిక స్థిరత్వాన్ని, నమ్మకాన్ని కాపాడటం అన్నారు.పశువైద్య సహాయం, జంతు సంరక్షణ, నాణ్యమైన మేత, శిక్షణ, డిజిటల్ సాధనాలు, ఆర్థిక రక్షణ ద్వారా నిరంతరం రైతుల సామర్థ్యాన్ని పెంచడానికి పెట్టుబడి పెడతామన్నారు. ఎందుకంటే, సాధికారత పొందిన రైతులే స్థిరమైన జీవనోపాధిని నిర్మించుకోగలరని పేర్కొన్నారు. ఆ స్థిరత్వమే మీరు పొందే ఉత్పత్తుల నాణ్యతలో ప్రతిబింబిస్తుందని తెలిపారు.

బోయినపల్లి ప్రభుత్వ పాఠశాలలో షీటీమ్ అవగాహన

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 21 నేటినిజం (ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గితే ఆదేశాల మేరకు జిల్లా షీ టీమ్ ప్రతి రోజూ విద్యాసంస్థలు, మహిళలు పని చేసే ప్రదేశాలను సందర్శిస్తూ గుడ్ టచ్ / బ్యాడ్ టచ్, ర్యాగింగ్, ఇవిటీజింగ్, పోక్సో చట్టం, షీ టీమ్ సేవలు, మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది.ఈ కార్యక్రమంలో భాగంగా బోయినపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను షీ టీమ్ బృందం సందర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించి, వేధింపులకు గురైతే నిర్భయంగా షీ టీమ్ నెంబర్ 87126 56425 కు ఫిర్యాదు చేయాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని , ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని సూచించారు. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులకు స్పందించకూడదని,గుర్తు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవొద్దని తెలిపారు.ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఏఎస్ఐ ప్రమీల, వీరయ్య, సిబ్బంది శ్రీలత, ప్రియాంక, శ్రీనివాస్‌తో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధిపై బీఆర్ఎస్ దుష్ప్రచారాలు

– పదేళ్ల టిఆర్ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం

–మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 21 నేటినిజం (ప్రతినిధి): :వేములవాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి తట్టుకోలేక, ఉనికి కోసం పాకులాడుతున్న బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలు హాస్యాస్పదమని వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ తీవ్రంగా ఖండించారు.ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయిన ఆ పార్టీ నాయకులు, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి చేస్తున్న రాజకీయం పట్ల ప్రజలు విసుగు చెందారని ఆయన ధ్వజమెత్తారు.దళితుల సంక్షేమం గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ పార్టీకి లేదని, పదేళ్ల కాలంలో దళితులకు చేసిందే మిటనీ బీఆర్ఎస్ నాయకుల నునిలదీశారు. నిర్మించిన దళిత గడపల నాణ్యత ఎంత అని, దీనిపై రాజన్న గుడి ముందే బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు.ఎన్నికల సమయంలో మాత్రమే వచ్చి, ఫోటోలకు ఫోజులిచ్చి మాయవయ్యే నాయకులను వేములవాడ ప్రజలు ఇప్పటికే తిరస్కరించారని, అందుకే మొన్నటి ఎన్నికల్లో మూడో స్థానానికి పరిమితం చేశారని గుర్తు చేశారు.పదేళ్లు నిర్లక్ష్యానికి గురైన రోడ్లు, బ్రిడ్జులు, డ్రైనేజీ వ్యవస్థలను కాంగ్రెస్ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరిస్తోందని, ప్రజల్లో వస్తున్న మార్పే అభివృద్ధికి నిదర్శనమని రాకేష్ పేర్కొన్నారు.అభివృద్ధిని అడ్డుకుంటే ప్రజలే మీకు సరైన బుద్ధి చెబుతారని, మాటలతో రాద్ధాంతాలు చేయడం కాదు, అభివృద్ధి చేసే దమ్ముంటే నిరూపించుకోవాలని సవాల్ విసిరారు.

ప్రజా ప్రభుత్వంలోనే స్వంత ఇంటి స్వప్నం సాధ్యం

– ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 21 నేటినిజం (ప్రతినిధి): స్వంత ఇంటి స్వప్నం ప్రజా ప్రభుత్వంలోనే సాధ్యం అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం వేములవాడ అర్బన్ మండలం నంకేవల్లి గ్రామంలో, పట్టణంలోని 13 వార్డులో నిర్వహించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాలొన్నారు.లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారికి నూతన వస్త్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజలకు గృహ స్వప్నాన్ని నెరవేర్చే లక్ష్యంతో చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా అనేక కుటుంబాలు సొంతింటి సంతోషాన్ని పొందుతున్నాయని వారు పేర్కొన్నారు.

మున్సిపల్ చైర్మన్ ఫుల్ కం రాజుకు ప్రముఖుల సత్కారం

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 21 నేటినిజం (ప్రతినిధి): :వేములవాడ మున్సిపల్ చైర్మన్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పుల్కం రాజుకి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏంఏ రాహిల్, ముస్లిం టౌన్ కమిటీ పట్టణ ప్రధాన కార్యదర్శి షాహిద్ పాషా, రజక సంఘం రాష్ట్ర రజక సంఘం కన్వీనర్ వైలారం రాము, ఎండి తాజ్ లుశాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.వేములవాడ పట్టణ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com